రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన అవసరం: కలెక్టర్



సూర్యాపేట సద్దుల చెరువు వద్ద 2కె రన్‌లో పాల్గొన్న ప్రభుత్వ వైద్య కళాశాల సిబ్బంది, విద్యార్థులు

సూర్యాపేట (ఖాళ్లగడ్డ), న్యూస్‌టుడే: ముప్ఫై ఐదు సంవత్సరాలు నిండిన మహిళలందరూ ఏటా విధిగా రొమ్ము క్యాన్సర్(బ్రెస్ట్ క్యాన్సర్) పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆధ్వర్యంలో రొమ్ము క్యాన్సర్‌పై నిర్వహించిన 2కె రన్ కార్యక్రమాన్ని కలెక్టర్ సోమవారం ప్రారంభించి మాట్లాడారు. రొమ్ము క్యాన్సర్ అంటు వ్యాధి కాదని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రాథమిక స్థాయిలోనే దీనిని గుర్తించడం ద్వారా నివారించుకునే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్క్రీనింగ్ టెస్టు, మెమోగ్రామ్ పరీక్షలను ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు.

★ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జయలత మాట్లాడుతూ.. నేషనల్ బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్ ద్వారా అక్టోబరును బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన నెలగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీని నివారణకు ఐదు రకాల చికిత్సలు ఉంటాయన్నారు. వైద్య కళాశాల నుంచి మినీట్యాంక్ బండ్ వరకు నిర్వహించిన 2కె రన్ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. వైద్యులు శ్రీకాంత్‌భట్, సత్యనారాయణ, రమేశ్, యశ్వంత్, ఈశ్వరమ్మ, రాకేశ్‌చంద్ర, పావని, సునీత, భూలక్ష్మి పాల్గొన్నారు.

సదరం శిబిరం తేదీలు ఖరారు

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: సదరం ధ్రువపత్రం కలిగి ఉండి గడువు ముగిసిన వారు మీసేవ కేంద్రంలో రెన్యూవల్ చేసుకోవాలని డీఆర్డీఓ అప్పారావు సోమవారం తెలిపారు. ఆధార్, గడువు ముగిసిన సదరం ధ్రువపత్రం ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. ఈనెల 23, 30న సదరం శిబిరాలు నిర్వహించనున్నట్లు, ఆయా తేదీల ప్రకారం స్లాటు నమోదు చేసుకోవాలన్నారు. కొత్తగా సదరం ధ్రువపత్రం పొందేందుకు ఆధార్, పాస్ పోటో తీసుకెళ్లి ఎప్పుడైన స్లాటు నమోదు చేసుకోవచ్చన్నారు. నమోదుకు మీసేవ రూ.35 మాత్రమే చెల్లించాలని, అంత కన్నా ఎక్కువ వసూలు చేస్తే సంబంధిత మీసేవపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అడుగడుగునా కూడళ్లు.. కొన్నింటికే దిద్దుబాట్లు

❑ మరిన్నీ అండర్‌పాస్ వంతెనల నిర్మాణానికి ప్రజల వేడుకోలు

చౌటుప్పల్(గ్రామీణం, న్యూస్‌టుడే:

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి-65పై తరచూ ప్రమాదాలు జరిగే 17 ప్రాంతా(బ్లాక్ స్పాట్స్)లలో అండర్‌పాస్ వంతెనలు, సర్వీసు రోడ్డు పనులు జాతీయ ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. రూ.282 కోట్లకు టెండర్ దక్కించుకున్న హరియాణాకు చెందిన రామ్‌కుమార్ సంస్థ ఈ పనులు చేపడుతోంది. ఇక్కడే కాకుండా.. ఇంకొన్ని ప్రాంతాల్లోనూ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా చోట్ల అండర్‌పాస్ వంతెనలు లేక జాతీయ రహదారి దాటే సమయంలో పాదచారులు, వాహనచోదకులు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. వాటిల్లోనూ అండర్‌పాస్ వంతెనలు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపించకపోవడంతోనే సమస్య ఏర్పడిందని, పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

గుర్తించిన బ్లాక్‌స్పాట్‌లలో మొదలైన పనులు

యాదాద్రిభువనగిరి జిల్లాలోని దండుమల్కాపురం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని నందిగామ వరకు 181.5 కిలోమీటర్ల దూరంలో 17 ప్రాంతాలను బ్లాక్‌స్పాట్లుగా ఎన్‌హెచ్‌ఏఐ, పోలీసు అధికారులు గుర్తించారు. ఏడాదిన్నరలో పనులు పూర్తి చేయాలని ఎన్‌హెచ్‌ఏఐ గుత్తేదారు సంస్థను ఆదేశించింది. ప్రస్తుతం చౌటుప్పల్, పెద్దకాపర్తి, చిట్యాల, ఇనుపాముల, టేకుమట్ల, సూర్యాపేట ఎస్వీకళాశాల-జనగామ కూడలి, జమ్మిగడ్డ కూడలి, ముకుందాపురం యూటర్న్ మునగాల, కొమరబండ, కోదాడ, శ్రీరంగాపురం వద్ద అండర్ పాస్ వంతెన, సర్వీసు రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. కొన్నిచోట్ల చెట్లు కొట్టేశారు.

★ కట్టంగూరు జంక్షన్(నల్గొండ రోడ్డు), దురాజ్‌పల్లి, నవాబుపేట(ఏపీ) వద్ద పనులను ప్రారంభించాల్సి ఉంది.



చౌటుప్పల్: దండుమల్కాపురం శివారులో ప్రమాదకర కూడలి

ఇక్కడ అండర్‌పాస్‌లు అత్యవసరం

◆ చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం పారిశ్రామిక పార్కు ఎదుట అండర్‌పాస్ వంతెన అత్యవసరం. ఈ పార్కులో ఇప్పటికే వందకు పైగా పరిశ్రమలు ప్రారంభం కావడంతో వాహనాల రాకపోకలు పెరిగాయి. రాబోయే రోజుల్లో మరిన్నీ పరిశ్రమలు ఏర్పాటు కాబోతున్నాయి. హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలకు ఎదురుగా.. పార్కు నుంచి వచ్చే వాహనాలు టెక్స్‌టైల్ పార్కు ముందు నుంచి వ్యతిరేక మార్గంలో వస్తున్నాయి. పార్కు ఎదురుగానే ఆంధోల్ మైసమ్మ దేవాలయానికి వచ్చే భక్తుల వాహనాలు విజయవాడ మార్గంలో అపసవ్య దిశలో ప్రయాణిస్తున్నాయి. ఆదివారం భక్తుల రద్దీ ఉంటుంది. ఇక్కడ అండర్‌పాస్ వంతెన నిర్మిస్తే వాహనదారులు, భక్తులకు ఉపయోగకరంగా ఉంటుంది.

◆ చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం, అంకిరెడ్డిగూడెం స్టేజీ, పంతంగి స్టేజీ నుంచి ఆరెగూడెం స్టేజీ వరకు అండర్‌పాస్‌లు అవసరం. ఈ ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల్లో ఇప్పటికే పదుల సంఖ్యలో ప్రయాణికులు ప్రాణాలు విడిచారు. పంతంగి గ్రామస్థులు కూడా ప్రజాప్రతినిధులు, ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

◆ చిట్యాల మండలం పిట్టంపల్లి, వట్టిమర్తి, నార్కట్‌పల్లి మండలంలోని గోపాలయపల్లి శ్రీ వేణుగోపాలస్వామి కమాన్, కట్టంగూరు పట్టణం, నకిరేకల్ బైపాస్ ముందు పద్మానగర్ జంక్షన్, అయిటిపాముల వద్ద కూడా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వంతెనలను నిర్మిస్తేనే సమస్యలు తీరతాయి.

◆ మునగాల మండలం తాడ్వాయి క్రాస్‌రోడ్డు నుంచి పది గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ మనుషులతో పాటు పశువులు మృతి చెందుతున్నాయి. రాత్రి ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నా.. బారికేడ్లు, విద్యుద్దీపాలు ఏర్పాటు చేయడం లేదు.

వ్యతిరేక దిశలో రాకపోకలు

–గోపాల్‌రావు, తెలంగాణ పరిశ్రమల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

పారిశ్రామిక పార్కుకు ఇప్పుడు రోజూ వెయ్యి వరకు వాహనాలు వస్తున్నాయి. 1800 ఎకరాల్లో విస్తరించి ఉన్న పార్కులో పరిశ్రమలన్నీ ప్రారంభమైతే పది వేలకు వరకు వస్తాయి. పార్కు నుంచి విజయవాడ మార్గంలోకి వ్యతిరేక దిశలో వెళ్లాల్సి వస్తోంది. సమస్యను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. పరిష్కరించాలని వారు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను కోరారు.

రహదారి విస్తరణ సమయంలో నిర్మిస్తాం

– నాగేశ్వర్‌రావు, ప్రాజెక్ట్ డైరెక్టర్, ఎన్‌హెచ్–65

గత ప్రతిపాదనల ప్రకారం ప్రస్తుతం కొన్ని బ్లాక్ స్పాట్‌లలో అండర్‌పాస్ వంతెనలు నిర్మిస్తున్నాం. కొత్తగా అవసరమయ్యే ప్రాంతాల్లో ఆరు వరసల రహదారి విస్తరణ సమయంలో చేపడతాం. విస్తరణ అంశం డీపీఆర్ దశలో ఉంది. వచ్చే ఏడాది పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివి



సూర్యాపేటలో పోలీసు అమర వీరులకు వందనం సమర్పిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్, తదితరులు

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు ప్రాణాలను సైతం పణంగా పెట్టి నిరంతరం శ్రమిస్తున్నారని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో అమర వీరుల స్తూపానికి సోమవారం నివాళి అర్పించి మాట్లాడారు. పోలీసు సిబ్బంది త్యాగ ఫలితంగానే సమాజంలో ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారని పేర్కొన్నారు. వారి త్యాగాలు వెలకట్టలేనివని, ఏమిచ్చినా.. ఏం చేసినా కుటుంబాలకు వారు లేనిలోటు తీర్చలేనిదన్నారు. అమర వీరుల కుటుంబాలకు అందుబాటులో ఉంటామని, వారి సంక్షేమానికి కృషి చేస్తామని హామీఇచ్చారు. అనంతరం పోలీసు అమర వీరుల కుటుంబ సభ్యులకు జ్ఞాపికలను అందజేశారు. పోలీసు పరేడ్ కమాండర్‌గా ఆర్ఐ నరసింహ, ఏఆర్ అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ ఏడాదిలో దేశవ్యాప్తంగా అమరులైన 214 మంది పోలీసు సిబ్బంది, జవానుల పేర్లను అదనపు ఎస్పీ నాగేశ్వరరావు స్మరించారు. పోలీసు కళాబృందం సభ్యులు అమరుల త్యాగాలను వివరిస్తూ సాంస్కృతిక గేయాలను ఆలపించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ లక్ష్మానాయక్, డీఎస్పీలు రవి, శ్రీనివాస్, ఏఆర్ డీఎస్పీ నరసింహాచారి, ఏవో మంజుభార్గవి, అమర వీరుల కుటుంబ సభ్యులు, పోలీసు సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ..

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: అమర వీరుల సంస్మరణ దినోత్సవం పోలీసు ఫ్లాగ్‌డే సందర్భంగా పూల సెంటర్ నుంచి కల్నల్ సంతోశ్‌బాబు చౌరస్తా వరకు సోమవారం రాత్రి శాంతి ర్యాలీ నిర్వహించారు. అమర వీరుడు కల్నల్ సంతోశ్‌బాబు విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడిన అమరుల త్యాగాలను కొనియాడారు. ఏఆర్ అదనపు ఎస్పీ జనార్దన్ రెడ్డి, డీఎస్పీ రవి, ఏఆర్ డీఎస్పీ నరసింహచారి, పట్టణ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.



సూర్యాపేటలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీ రవి, తదితరులు

నిధులున్నా.. నిర్మాణం సున్నా..!

నూతనకల్, న్యూస్‌టుడే: మండలంలోని సోమ్లాతండా-సూర్యాపేట ప్రధాన రహదారి గ్రామీణ ప్రాంత ప్రజలను పట్టణానికి చేరవేసే ప్రధాన మార్గం. సోమ్లాతండా, బక్కహేమ్లాతండా, టీక్యాతండా, తాళ్లసింగారం గ్రామాలతోపాటు సుమారు 14 ఆవాస గిరిజన ప్రాంతాల ప్రజలు నిత్యం ఈ రోడ్డువెంట ప్రయాణిస్తుంటారు. తాళ్లసింగారంలో రామసముద్రం, పక్కనే ఉన్న కందగట్ల చెరువుల అలుగు ప్రవాహాలు ఈ రెండు లోలెవల్ కల్వర్టు నుంచి వెళ్లాల్సి ఉంటుంది. వానాకాలం వచ్చిందంటే ఈ కల్వర్టుల పైనుంచి వరద వెళ్లి రాకపోకలు నిలిచిపోతాయి. కల్వర్టు అంచులు కోతకు గురవుతుంటాయి.



సోమ్లాతండా-సూర్యాపేట ప్రధాన రహదారి వెంట కోతకు గురైన తాళ్లసింగారం లోలెవల్ కల్వర్టు

◆ గతేడాది ఈ లోలెవల్ కల్వర్టుల స్థానంలో వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం ఒక దానికి రూ.75 లక్షలు, మరొకదానికి రూ.50 లక్షలను మంజూరు చేసింది. వీటిల్లో ఒక వంతెన నిర్మించారు. పంచాయతీరాజ్ అధికారుల ప్రణాళిక లోపంతో సామర్థ్యానికి అనుగుణంగా నిధుల మంజూరుకు సిఫారసు చేయకపోవడంతో రూ.50 లక్షల వంతెన పనులు చేయడానికి ఎవరు ముందుకురావటం లేదు. దీంతో నిధులున్నా.. ఏడాది గడుస్తున్నా.. వంతెన నిర్మాణం ఊసే కనబడటం లేదు. రెండు నెలల కిందట వచ్చిన భారీ వర్షాలకు కల్వర్టు కోతకు గురై.. తక్షణ సాయం కింద రూ.4 లక్షలు మంజూరవటంతో మరమ్మతులు చేపడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వంతెన నిర్మాణం చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లామని పంచాయతీరాజ్‌శాఖ డీఈ లింగానాయక్ 'న్యూస్‌టుడే'కు వివరించారు.

చెరువులో పడి ఒకరి మృతి

మునగాల గ్రామీణం, న్యూస్‌టుడే: చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన ఆకుపాములలోని కామకుంట చెరువులో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పచ్చిపాల కోటయ్య(46) కౌలు వ్యవసాయం చేస్తూ పశువులు కాస్తుంటారు. సాయంత్రం వేళ చెరువులోకి వెళ్లిన పశువులను తీసుకువచ్చే క్రమంలో కాలు జారి అందులో పడిపోయారు. పక్కనే పొలాల్లో ఉన్న రైతులు గుర్తించి సమాచారం అందించడంతో.. అగ్నిమాపక, రెస్క్యూ బృందం వచ్చి గాలించి మృతదేహాన్ని వెలికితీశారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

బండలకు పాలిష్ పడుతుండగా విద్యుదాఘాతం: వ్యక్తి దుర్మరణం



శ్రీను

కోదాడ గ్రామీణం, న్యూస్‌టుడే: నూతనంగా నిర్మిస్తున్న ఓ ఇంట్లో విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని నల్లబండగూడెంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గణపవరానికి చెందిన భూక్య శ్రీను(45) నల్లబండగూడెంలోని ఓ ఇంట్లో బండలకు పాలిష్ పడుతుండగా.. విద్యుదాఘాతానికి గురయ్యారు. స్థానికులు గమనించి కరెంటు సరఫరాను నిలిపివేసే సమయానికి శ్రీను మరణించడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై అనిల్‌రెడ్డి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు అందలేదని ఎస్సై పేర్కొన్నారు.

కొనుగోళ్ల పర్యవేక్షణ ప్రత్యేక అధికారుల బాధ్యతే: కలెక్టర్

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజావాణిలో అర్జీలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కార్యక్రమంలో ఆయన దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. ప్రజలు ఇబ్బంది పడకుండా సాధ్యమైనంత త్వరగా సమస్యలు పరిష్కరించాలని సూచించారు. మండలాలకు కేటాయించిన ప్రత్యేక అధికారులు తమ మండలంలో కొనుగోలు కేంద్రాలను నిరంతరం ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఆశ కార్యకర్తలు రోజువారి కార్యక్రమ వివరాలు నమోదు చేసుకునేందుకు ఆశా కార్యకర్త దినచర్య రికార్డులను అందజేశారు. అనంతరం పలువురు అర్హులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. వివిధ సమస్యలపై ప్రజావాణిలో 94 దరఖాస్తులు అందాయన్నారు. సీపీవో కిషన్, డీపీవో నారాయణరెడ్డి, డీఏవో శ్రీధర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో కోటాచలం, డీడబ్ల్యూవో నర్సింహారావు, సంక్షేమ అధికారులు లత, శంకర్, అనసూయ, జగదీశ్వర్‌రెడ్డి, ఏవో సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు



నాగారం పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి కోటా చలం

నాగారం, న్యూస్‌టుడే: మండల కేంద్రాల్లోని పీహెచ్‌సీల్లో పనిచేసే వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి కోటాచలం హెచ్చరించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. సాధారణ కాన్పులను ప్రోత్సహించాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో ఔషధాలు అందుబాటులో ఉండేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఆసుపత్రిలో ఓపీ, మందుల గదులను పరిశీలించారు. మండల వైద్యాధికారి హర్షవర్ధన్, సిబ్బంది సీహెచ్‌వో బిచ్చునాయక్, ల్యాబ్‌టెక్నీషియన్ ప్రవీణ్‌రెడ్డి, రామచంద్రయ్య, యాదగిరి పాల్గొన్నారు.

నిర్వహణ లేక.. వాడడం వీలుకాక

కోదాడ మండల పరిధిలోని మంగళితండాలో రూ.20 లక్షల వ్యయంతో వైకుంఠధామం, డంపింగ్‌యార్డు, సేంద్రియ ఎరువు తయారీ కేంద్రాన్ని పాలేరు వాగుకు ఆనుకొని ఉన్న స్థలంలో గత ప్రభుత్వం నిర్మించింది. వాగులోకి వరద వచ్చిన ప్రతిసారి నిర్మాణాలు నీట మునగడం ఇక్కడ ఆనవాయితీగా మారుతోంది. నేటి వరకు గ్రామస్థులు వీటిని ఉపయోగించుకోలేని పరిస్థితి. ఇలాంటి దృశ్యాలే కొత్తగూడెం, నల్లబండగూడెం, రెడ్లకుంటలో కనిపిస్తాయి.

కోదాడ గ్రామీణం, న్యూస్‌టుడే:

అభివృద్ధి కార్యక్రమాల పేరుతో ప్రజాధనం వృథాగా మారుతోంది. పనుల పేరుతో ప్రజల జేబులకు చిల్లులు పడుతున్నాయి. కోట్లు ఖర్చుపెట్టి వీటి నిర్మాణాలు చేపట్టి నిర్వహణను గాలికి వదిలేస్తున్నారు. జిల్లాలో 475 గ్రామపంచాయతీల్లో వైకుంఠధామాలు, డంపింగ్‌యార్డులు, ఎరువు తయారీ కేంద్రాలకు రూ.కోట్లు వెచ్చించి నిర్మించారు. పర్యవేక్షణ లోపం కారణంగా అవి శిథిలావస్థకు చేరాయి. రాత్రి సమయంలో అసాంఘిక కార్యక్రమాలకు నిలయాలుగా మారుతున్నాయి. మందుబాబులకు అడ్డాలుగా నిలుస్తున్నాయి.



మంగళితండాలో పాలేరు వాగు వరద తాకిడికి ధ్వంసమైన వైకుంఠధామం, డంపింగ్‌యార్డు, ఎరువు తయారీ కేంద్ర సముదాయం

★ జీపీ సిబ్బంది చెత్తను సేకరించి డంపింగ్ యార్డులలో వేయడం లేదు. సేంద్రియ ఎరువు తయారీ ఊసే లేదు. వైకుంఠధామాల ఉపయోగమూ అంతంత మాత్రంగానే ఉంది. చాలా జీపీలలో చెత్తను కాల్చివేస్తూ పర్యావరణానికి హాని కల్గిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్మించిన నిర్మాణాలు గ్రామాలకు దూరంగా ఉండటం, పర్యవేక్షణ లోపం కారణంగా అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట లేకుండా పోయింది.

పర్యవేక్షణ తప్పనిసరి..

గ్రామ స్థాయిలో అధికారులు ప్రజలకు వీటిపై అవగాహన కల్పించి ఉపయోగించుకునేలా చర్యలు చేపట్టాలి. భవనాలు, విలువైన సామగ్రి ధ్వంసం కాకుండా సిబ్బందిని ఏర్పాటు చేయాలి. చుట్టూ రక్షణగా ప్రహరీలు నిర్మించాలి. మందుబాబులు రాకుండా జరిమానాలు విధించాల్సిన అవసరం ఉంది.

అవగాహన కల్పిస్తున్నాం: నారాయణరెడ్డి, డీపీవో

వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులను ఉపయోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. వీటిలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు చేపడతాం. రక్షణగా కంచెలను ఏర్పాటు చేసి పర్యవేక్షించేందుకు చర్యలు తీసుకుంటాం.

స్వీప్ కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళిక

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో బూత్ అధికారులను సమన్వయం చేసుకుంటూ అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పేర్కొన్నారు. వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల ప్రక్రియపై హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి సోమవారం నిర్వహించిన ఓటరు జాబితా రూపకల్పనపై కలెక్టర్లతో దూర దృశ్య శ్రవణ సమీక్షలో వివరాలు వెల్లడించారు. అనంతరం స్థానికంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రత్యేక స్వీప్ కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళిక తయారు చేశామని, ఎమ్మెల్సీ స్థానాల ఓటరు దరఖాస్తులు సకాలంలో విచారణ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ఆర్డీవో వేణుమాధవ్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస రాజు, డీఈవో అశోక్ పాల్గొన్నారు.



సీఎంఆర్ లక్ష్యం.. బహుదూరం



భువనగిరి: ఈ నెల 6న మిల్లులో ఆకస్మిక తనిఖీలు చేసిన ఎఫ్‌సీఐ అధికారుల బృందం(దాచిన చిత్రం)

భువనగిరి, న్యూస్‌టుడే:

కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్)ను మిల్లర్లు ప్రభుత్వానికి తిరిగి చెల్లించడంలో వెనుకబడిపోయారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో వానాకాలం, యాసంగి సీజన్‌లో కొన్న ధాన్యాన్ని ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలోని మిల్లర్లకు కేటాయించారు. ఈ ధాన్యాన్ని మిల్లింగ్ చేసి బియ్యం ఇచ్చేందుకు ఎఫ్‌సీఐ అక్టోబరు చివరి వరకు గడువు విధించింది. ఆ లోపు లక్ష్యం పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు. త్వరితగతిన సీఎంఆర్ పూర్తిచేసేలా అధికారులు మిల్లర్లపై ఒత్తిడి తెస్తున్నారు.

వెనకంజలో సూర్యాపేట జిల్లా

గత రెండు సీజన్లలోనూ నల్గొండ జిల్లాలోని మిల్లర్లు సీఎంఆర్‌ను అప్పగించడంలో ముందంజలో ఉన్నారు. వానాకాలంలో నల్గొండ జిల్లాలో 96 శాతం, యాదాద్రి భువనగిరి జిల్లాలో 90, సూర్యాపేట జిల్లాలో తక్కువగా 61 శాతం బియ్యాన్ని తిరిగి ఇచ్చారు. ఈ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం గడువు పొడిగించే అవకాశాలు కనిపించడంలేదని అధికారులు చెబుతున్నారు.

◆ యాసంగి సీజన్‌కు సంబంధించి కొంత మేరకు మూడు జిల్లాలూ వెనుకబడి ఉన్నాయి. నల్గొండ జిల్లాలో 67 శాతం, యాదాద్రి భువనగిరి 40, సూర్యాపేట జిల్లాలో కేవలం 27 శాతం మాత్రమే సీఎంఆర్‌ను ప్రభుత్వానికి ఇచ్చారు. సూర్యాపేట జిల్లా రెండు సీజన్లలోనూ వెనుకంజలో ఉండటంతో మిల్లుల్లో ధాన్యం ఉందా లేదా అని అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సీఎంఆర్ వసూళ్లలో అధికారులు ఉదాసీనతపై ఆరోపణలు ఉన్నాయి.

మధ్యలోనే తనిఖీలు నిలిపి..

మిల్లుల్లో ధాన్యం ఉందా లేదా తెలుసుకునేందుకు భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ) అధికారులు అక్టోబరు 6న తనిఖీలు చేపట్టారు. ఒక రోజు పలు మిల్లుల్లో తనిఖీలు చేసి ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో మధ్యలోనే నిలిపివేశారు.

మిల్లర్లపై ఒత్తిడి తెస్తున్నాం

– జగదీశ్వర్, జిల్లా మేనేజర్, పౌర సరఫరాల సంస్థ, యాదాద్రి భువనగిరి జిల్లా

సీఎంఆర్ తిరిగి ఇవ్వడంలో యాదాద్రి భువనగిరి జిల్లా మిల్లర్లు ముందంజలో ఉన్నారు. అయినా గడువులోగా చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నాం. జిల్లాలో డిఫాల్టైన మిల్లులు లేవు. పూర్తి సీఎంఆర్ సేకరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

2023-24 వానాకాలం సీజన్‌లో సేకరించిన ధాన్యం, సీఎంఆర్ వివరాలు (మెట్రిక్ టన్నుల్లో)

జిల్లా	మిల్లర్లకు ఇచ్చిన ధాన్యం	సీఎంఆర్ ఇవ్వాల్సింది	ఇచ్చింది	బకాయి
నల్గొండ	3,22,754	2,17,577	2,08,442	9,134
సూర్యాపేట	2,08,114	1,40,154	85,108	55,046
యాదాద్రి	2,65,197	1,78,887	1,58,493	20,394
2023-24 యాసంగి సీజన్‌లో ..				
నల్గొండ	3,26,067	2,21,726	1,49,444	72,282
సూర్యాపేట	2,40,579	1,63,593	44,340	1,19,253
యాదాద్రి	2,70,668	1,84,054	73,387	1,10,667

బంతి సాగు.. ఆదాయం బాగు

సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే: భిన్న సాగులో రాణించి.. ఆదాయం గడించాలని అన్నదాతలు ముందుకు సాగుతున్నారు. అందులో భాగంగా ప్రస్తుతం వరుస పండగలు ఉండటంతో దీనిని దృష్టిలో ఉంచుకుని అందుకు అత్యధికంగా వినియోగించే పూల సాగును ఎంచుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పూల సాగు వైపు అన్నదాతలు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం చేతికొస్తున్న బంతిపూల దిగుబడితో అధిక ఆదాయం పొందుతున్నారు. ఇటీవల వచ్చిన భారీ వర్షాలకు అక్కడక్కడ బంతి పూల తోటలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతానికి తోటల వద్ద కిలో రూ.100 చొప్పున విక్రయిస్తున్నారు. కొందరు రైతులు దళారులకు కాకుండా నేరుగా వినియోగదారులకే విక్రయిస్తూ మరింత ఆదాయం పొందుతున్నారు. మూస ధోరణిలో సాగు చేపట్టకుండా ప్రజల అవసరాల మేరకు విభిన్నంగా ఆలోచన చేసి ఆదాయం పొందుతూ పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.


సంస్థాన్ నారాయణపురంలో బంతి పూల సాగులో యువకుడు శికిలమెట్ల శివప్రసాద్

రైతేరాజు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2024-25 సంవత్సరంలో 7,562 ఎకరాల్లో సాగు చేపట్టారు. కాగా గత ఏడాది 5,752 ఎకరాలు చేయగా ఈసారి 1800 ఎకరాల్లో సాగు పెరిగింది. ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పూలసాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. వరిలో పీడవలన నుంచి నష్టం వాటిల్లకుండా, జాగ్రత్తలు పాటిస్తూ ముందుకు సాగుతున్నారు. వర్షాల కారణంగా అక్కడక్కడ దెబ్బ తిన్నా బాగున్న వరకు ఆదాయం బాగానే ఉందని రైతులు పేర్కొంటున్నారు.

సంస్థాన్ నారాయణపురం: బతుకమ్మ, దసరా, దీపావళి, సంక్రాంతి పండగలను దృష్టిలో పెట్టుకొని బంతి పూల సాగు చేశారు సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన శికిలమెట్ల శివప్రసాద్. బీఫార్మసీ-యాదాద్రి... వ్యవసాయ భూమి ఉంది. పండుగలను దృష్టిలో పెట్టుకొని అర ఎకరంలో బంతిపూల సాగు చేశారు. స్థానిక కంపెనీలో పనికి వెళ్తూ పూల సాగుపై ఆసక్తి చూపి.. పండుగ వేళ దిగుబడి వచ్చేలా పచ్చ, ఎర్ర బంతి సాగు చేశారు. ప్రస్తుతం పూలను తెంపి ఇంటి వద్ద కుప్పలుగా పోసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసి ప్రచారం చేసుకుంటున్నారు. కొనుగోలుదారులు ఇంటి వద్దకే రావడంతో ఖర్చులు తగ్గి అనుకున్న లాభాలను ఆశిస్తున్నారు.

యాసంగిలో వేరుసెనగకు అనుకూల సమయం, రకాలు

త్రిపురారం, న్యూస్‌టుడే: యాసంగిలో వేరు సెనగ సాగు చేయడానికి అనుకూల సమయం, రకాల గురించి కంపాసాగర్ కేవీకే ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాస్‌రావు తెలియజేశారు. వేరుసెనగ తెలంగాణలో అత్యధిక విస్తీర్ణంలో సాగవుతున్న నూనె గింజల పంట. దక్షిణ తెలంగాణలో సెప్టెంబరు మొదటి పక్షం నుంచి నవంబరు రెండో పక్షం వరకు విత్తుకోవచ్చు.

రకం	పంట కాలం	దిగుబడి ఎకరాకు
కదిరి - 6	100, 110 రోజులు	12, 14 క్వింటాళ్లు
కదిరి - 9	110, 120 రోజులు	10 ,12 క్వింటాళ్లు
ధరణి :	100, 105 రోజులు	9, 10 క్వింటాళ్లు
కదిరి 7,8	120, 130 రోజులు	12, 14 క్వింటాళ్లు

యాసంగిలో నీటి పారుదల కింద సాగు చేసేటప్పుడు 22.5, 10 సెం.మీ. దూరంలో ఒక చదరపు మీటరుకు 44 మొక్కలు ఉండేలా మొక్కల సాంద్రత పాటించాలి.

సమస్య - సమాధానం

? బత్తాయిలో వేరుకుళ్లు తెగులు నివారణ గురించి తెలపండి.

– రామకృష్ణ, హరిజనపురం గ్రా., చింతపల్లి మండలం

సమాధానం: నివారణకు రంగపూర్ నిమ్మ మీద అంటుకట్టిన మొక్కలను నాటుట శ్రేయస్కరం. వ్యాధి సోకిన తొలి దశలో గమనించి చెట్టుకు నీరు కట్టి మరుసటి రోజు కార్బండిజమ్ 2 గ్రా., మాంకోజెబ్ 2.5 గ్రా. లీటరు నీటికి కలిపి, (చెట్టుకు) మందును 3 గ్రా., లీటరు నీటికి, 1 శాతం బోర్డో మిశ్రమాన్ని చెట్ల పాదుల్లో నేల తడిచేలా పోయాలి.

? వరిలో సుడిదోమ నివారణ గురించి తెలపండి.

సుధీర్‌రెడ్డి, సింగారం గ్రా., మునుగోడు మండలం

సమాధానం: పిలకదశలో దుబ్బుకు 10, 15 అంకురం నుంచి ఈనిక దశలో దుబ్బుకు 20, 25 దోమలు గమనించిన వెంటనే నివారణ చేపట్టాలి. తొలి దశలో ఎసిఫేట్ 75 ఎస్‌.పి 1.5 గ్రా., ఇథోఫెన్‌ప్రాక్స్ 10 ఇ.సి 2.0 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఉద్ధృతి ఎక్కువగా ఉన్నపుడు డైనోటిఫ్యూరాన్ 20 ఎస్.జి 0.4 గ్రా., పైమెట్రోజైన్ 50 డబ్ల్యు.జి. 0.60 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

? మిరపలో కాయతొలుచు పురుగు నివారణ గురించి తెలపండి.

– కొండల్, తుంగపాడు గ్రా., చింతపల్లి మండలం

సమాధానం: ఎకరానికి థయోడికార్బ్ 200 గ్రా., ఎసిఫేట్ 300 గ్రా., క్లోరిపైరిఫాస్ 500 మి.లీ, స్పైనోసాడ్ 75 మి.లీ. పిచికారీ చేయాలి. సమగ్ర సస్యరక్షణ అవలంబించాలి.

– త్రిపురారం, న్యూస్‌టుడే


రైతులు వాట్సప్ ద్వారా అడిగే సమస్యలకు, సందేహాలకు కంపాసాగర్ కేవీకే ఉద్యాన విభాగం శాస్త్రవేత్త శ్రీనివాసరావు సమాధానం ఇస్తారు. ఫోన్ నంబర్: 77025 44771


శ్రీనివాసరావు

మానిపండు తెగులు ఆశించకుండా ఉండాలంటే..

త్రిపురారం, న్యూస్‌టుడే: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిలో మానిపండు తెగులు ఆశించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను కంపసాగర్ కేవీకే పీసీ శ్రీనివాసరావు తెలిపారు. పంట పూత దశలో గాలిలో అధిక తేమ శాతం, మబ్బులతో కూడిన వర్షపు జల్లులు, మంచు కురవడం వంటివి మానిపండు ఉద్ధృతికి దోహదపడుతుంది. పూత దశలో ఉన్నప్పుడు ఆకాశంలో శిలీంద్రం పెరుగుదల వల్ల ఆకుపచ్చ రంగు ముద్దగా అభివృద్ధి చెంది, పసుపు రంగులోకి మారి చివరకు నల్లబడుతుంది. నివారణకు ప్రొపికొనజోల్ 2 మి.లీ. కార్బండిజమ్ 50 శాతం డబ్ల్యూపీ 1 గ్రా., టెబుకొనజోల్, ట్రైఫ్లాక్సీ స్ట్రోబిన్ 75 డబ్ల్యూజీ 0.4 గ్రా., వెన్నులు పైకి వచ్చే దశలో ఒకసారి, వారం తర్వాత రెండోసారి పిచికారీ చేయాలి.

జీవితం చదివేద్దాం.. బతికి సాధిద్దాం



కోదాడ, మేళ్లచెరువు, మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

మన తాతలు, తండ్రులు అక్షరం ముక్క చదవకపోయినా.. జీవించారు. రెక్కల కష్టంతోనే ఐదుగురు నుంచి పది మంది పిల్లలను పెంచి పోషించారు. ఇప్పుడున్న వసతులు, సాంకేతికత, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అప్పుడు లేవు. ఇప్పుడున్న యువత చదువు అర్థం కాకపోయినా.. ఫెయిలైనా ఒత్తిడికి లోనై ప్రాణాలు తీసుకుంటున్నారు. క్షణికావేశంతో తల్లిదండ్రుల ఆశలను మధ్యలోనే తుంచి కన్నీళ్లు మిగులుస్తున్నారు. బలవన్మరణానికి పాల్పడే ముందు ప్రతి విద్యార్థి మన ముందు తరాలు విద్య లేకుండానే బతికారు.. మనం బతకలేమా అని ఒకసారి ఆలోచిస్తే.. ఈ ఆత్మహత్యలు ఉండవు.

కోదాడ పరిధిలోని ఓ ఇంటర్ కళాశాలలో పాలకవీడు మండలం సజ్జాపురం గ్రామానికి చెందిన ఓ విద్యార్థి ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పదో తరగతి వరకు తెలుగు మాధ్యమంలో చదివి ఇంటర్‌లో ఆంగ్ల మాధ్యమం చదువు అర్థం కావట్లేదని ఆదివారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆంగ్లం కష్టమైతే తెలుగులో చదువుకునే అవకాశం ఉన్నా.. ఆ దారిని ఎంచుకోకుండా క్షణికావేశంలో తనువు చాలించాడు. తల్లిదండ్రులకు పుత్రశోకం మిగిల్చాడు.

దామరచర్ల మండలంలోని ఓ తండాకు చెందిన తొమ్మిదో తరగతి చదివే బాలిక దసరా సెలవులు ముగించుకొని పాఠశాలకు వెళ్లింది. చదువు ఇష్టం లేదని శుక్రవారం పురుగు మందు తాగి చికిత్స పొందుతూ మరణించింది. చదువు ఒక్కటే జీవితం కాదు అని ఆలోచించే శక్తి లేక, మరో దారి తెలుసుకోక బాలిక ప్రాణాలు తీసుకుంది.

మేళ్లచెరువు మండలానికి చెందిన ఓ విద్యార్థి గతేడాది ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫెయిల్ అయ్యాడు. ఈ విషయం జీర్ణించుకోలేని ఆ బాలుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రులు కూలి పనులకెళ్లి చదివిస్తే చివరికి శోక సంద్రంలో ముంచాడు.

భరోసా కల్పించాలి



గ్రామీణ విద్యార్థులు ఎక్కువ శాతం తెలుగు మాధ్యమంలో చదువుతుంటారు. ఇంటర్‌లోకి వచ్చే సరికి ఆంగ్ల మాధ్యమం ఎంచుకుంటున్నారు. భవిష్యత్తులో తెలుగులో కంటే ఆంగ్ల మాధ్యమం చదివిన వారికే అవకాశాలు ఉంటాయనే అపోహతో ఇంగ్లిష్ విద్యనభ్యసిస్తున్నారు. ఒకేసారి భాషాపరమైన ఒత్తిడి.. పోటీని తట్టుకొని నిలబడాలనే ఉద్దేశంతో శక్తికి మించి కష్టపడుతూ కుంగుబాటుకు లోనై ప్రాణాలు తీసుకుంటున్నారు.

★ మొదటి సారి ఇంగ్లిష్ మీడియంలోకి వచ్చిన పిల్లలను దృష్టిలో ఉంచుకొని వారికి అర్థమయ్యేలా చెప్పాల్సిన బాధ్యత కళాశాలల యాజమాన్యాలపై ఉంది.

★ ఫీజుల వసూళ్లపైనే దృష్టి ఉంచకుండా.. చదువులో వెనుకబడిన పిల్లలను ప్రోత్సహించాలి. ★ మానసిక వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించి ఆత్మస్థైర్యం పెంపొందించాలి.

★ విద్యాశాఖ అధికారులూ క్షేత్రస్థాయిలో తనిఖీలు జరిపి విద్యార్థుల సమస్యలు తెలుసుకొని భరోసా కల్పించాలి.

వీరే మనకు ఆదర్శం

☛ కోదాడకు చెందిన గూటి వీరబాబు పదో తరగతి ఫెయిల్ కావడంతో ఏడాది పాటు పశువులు, మేకలు మేపారు. ఇంటర్ అతి కష్టం మీద పాసయ్యారు. తర్వాత ఉన్నత చదువులు చదివారు. తాజాగా వచ్చిన డీఎస్సీ ఫలితాల్లో 47 ఏళ్ల వయసులో సోషల్ విభాగంలో స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించారు.

☛ ఆరో తరగతిలోనే చదువు మానేసినా ఆరేళ్ల పాటు వివిధ పనులు చేసుకుంటూ.. తిరిగి దూర విద్య ద్వారా పదో తరగతి, డిగ్రీలో చేరారు.. మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన కుక్కల సైదులుగౌడ్. పదో తరగతిలో ఐదు సార్లు, డిగ్రీలో ఎనిమిది సార్లు ఫెయిలైనా కుంగి పోకుండా.. కష్టపడి చదివి గ్రూప్-2లో ఎక్సైజ్ ఎస్సై ఉద్యోగం పొందారు.

☛ ఏళ్ల తరబడి ఉద్యోగం రాక కుంగిపోయిన మిర్యాలగూడకు చెందిన కట్టా సోమిరెడ్డి కుటుంబ పోషణకు ఆటో డ్రైవర్‌గానూ మారారు. 16 ఏళ్ల తర్వాత గురుకుల ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించారు.

☛ నాలుగేళ్లలో 35 ఉద్యోగ అర్హత పరీక్షల్లో ఫెయిలైనా కుంగిపోకుండా 2018లో ప్రయత్నించి సివిల్స్‌లో 104వ ర్యాంకుతో ఏకంగా ఐఏఎస్ సాధించారు.. హరియాణాకు చెందిన విజయ్‌వర్ధన్.

చదువుతోనే జీవితం అవాస్తవం

– వీరేందర్, మానసిక నిపుణుడు, హైదరాబాద్



చదువు అనేది జీవితంలో ఒక భాగం మాత్రమే. చదువు రాకపోతే బతకలేమనేది అవాస్తవం. ఆత్మహత్య చేసుకునే ముందు విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తు చేసుకోవాలి. అమ్మానాన్న, అధ్యాపకులు కూడా పిల్లలు ఏ రంగాల్లో రాణిస్తారో గుర్తించి, అందులో వారిని ప్రోత్సహించాలి. విద్యార్థుల ప్రవర్తన, కదలికలను అనుక్షణం గమనించాలి. ఇప్పుడున్న యువత క్షణికావేశానికి లోనవుతున్నారు. వారిని ముందే గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తే ఫలితం ఉంటుంది.

20 గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల


నాగార్జునసాగర్ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: శ్రీశైలం నుంచి 2,02,730 క్యూసెక్కుల భారీ వరదనీరు వస్తుండటంతో ఎన్నెస్పీ అధికారులు సాగర్ నుంచి 20 గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. సోమవారం రాత్రి 9 గంటలకు అందిన సమాచారం మేరకు. . అధికారులు 20 గేట్లు 5 అడుగుల మేరకు ఎత్తి 1,59,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. గేట్లతోపాటు కుడి, ఎడమ, వరద కాల్వలు, ప్రధాన విద్యుత్కేంద్రం, ఎస్సెల్బీసీల ద్వారా మొత్తం 2,02,730 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా.. జలాశయ ప్రస్తుత నీటి మట్టం 588.90 అడుగుల వద్ద ఉంది.

టెయిల్‌పాండ్‌లో.. అడవిదేవులపల్లి: ఎగువ ప్రాంతం నుంచి టెయిల్‌పాండ్‌కు వరద నీటి రాక కొనసాగుతుండగా టెయిల్‌పాండ్ అధికారులు 14 గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేశారు. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు అందిన సమాచారం ప్రకారం.. ఎగువనున్న నాగార్జునసాగర్ జలాశయం నుంచి భారీగా వరద వస్తుండగా టెయిల్‌పాండ్ అధికారులు 13 గేట్లను 3 మీటర్లు, 1 గేటును 2.5 మీటర్లమేర ఎత్తి 2,13,088 క్యూసెక్కుల నీటిని దిగువనున్న పులిచింతలకు విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయ నీటి మట్టం 75.09 మీటర్ల వద్ద ఉందని ప్రాజెక్ట్ ఏఈ జయపాల్ తెలిపారు.

ఎమ్మెల్సీ ఓటరు జాబితాపై దృష్టి పెట్టాలి: కలెక్టర్



ఓటరు నమోదుపై దూరదృశ్య శ్రవణ సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి, జిల్లా అధికారులు

నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు, సాధారణ ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై దృష్టి సారించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆర్డీవోలను ఆదేశించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్‌లు, ఆర్డీవోలతో సోమవారం దూరదృశ్య శ్రవణ సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడారు. అర్హులు ఓటరుగా నమోదు చేసుకునేలా దరఖాస్తు చేయించాలన్నారు. జిల్లాలో 3500 నుంచి 4 వేల మంది టీచర్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదుకావల్సి ఉందని చెప్పారు. ఈనెల 26లోపు ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెండు రోజుల్లో ఓటరు అవగాహన కార్యక్రమాలపై జిల్లాస్థాయి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జడ్పీ సీఈవోను ఆదేశించారు.

28 లోపు ఫీజు చెల్లించాలి

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం డిగ్రీ 1,3,5 సెమిస్టర్ల పరీక్ష ఫీజును ఈనెల 28లోపు చెల్లించాలని ఎంజీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఉపేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

అంగన్‌వాడీల్లో ఉద్యోగ విరమణలు

○ 65 ఏళ్లు పైబడిన ఉపాధ్యాయినులు, ఆయాలకు అవకాశం


గరిడేపల్లి మండలం అప్పన్నపేటలోని అంగన్‌వాడీ కేంద్రం

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా ఉన్నతీకరిస్తూ.. అన్ని రకాల సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటుంది. కొంత విద్యార్హత కలిగిన స్థానిక మహిళలను అంగన్‌వాడీలో ఉపాధ్యాయినులు, ఆయాలుగా నియమించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే ఉన్న వారిలో 65 ఏళ్లు పైబడిన వారిని ఉద్యోగ విరమణ చేయించాలని నిర్ణయించింది.

ఆసరా పింఛనుకు వెసులుబాటు

ఉమ్మడి జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ ఏడాది ఏప్రిల్ 30 నాటికి 65 ఏళ్లు పైబడిన అంగన్‌వాడీ ఉపాధ్యాయినులు 88 మంది, ఆయాలు 334 మంది ఇప్పటికే ఉద్యోగ విరమణ చేశారు. వీరిలో ఉపాధ్యాయినులకు రూ.లక్ష, ఆయాలకు రూ.50 వేలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నల్గొండ జిల్లాలో 43 మంది ఉపాధ్యాయినులు ఇప్పటికే ఉద్యోగ విరమణ ప్రతిఫలం అందుకోగా.. మిగిలిన వారికి త్వరలోనే అందనున్నాయి. వీరు ఆసరా పింఛను కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

నిబంధనల ప్రకారమే వయసు నిర్ధారణ

నరసింహారావు, జిల్లా సంక్షేమాధికారి, సూర్యాపేట



అంగన్‌వాడీ కేంద్రాల్లో వయసు నిర్ధారణ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే జరిగింది. విద్యాశాఖ నుంచి జారీ చేసిన బోనఫైడ్, టీసీ, మార్కుల మెమో, ప్రొవిజనల్ ధ్రువీకరణ పత్రాల ఆధారంగా వయసు నిర్ధారణ చేస్తున్నాం. ఇప్పటికే 65 ఏళ్లు పైబడిన వారు ఉద్యోగ విరమణ చేశారు. వారికి ప్రభుత్వం నుంచి ప్రకటించిన నగదు రావాల్సి ఉంది.

ఆధారం.. పదో తరగతి మెమో

ఉద్యోగ విరమణ వయసును నిర్ధారించేందుకు పదో తరగతి లేదా ఆపై చదువుల్లో విద్యాశాఖ అందించిన ధ్రువీకరణ పత్రాన్ని పరిగణనలోకి తీసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో 90 శాతం పైగా సిబ్బందిలో ఎటువంటి విద్యా ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో.. వారిని జిల్లాలో ఆసుపత్రుల్లో బోన్ డెన్సిటో మెట్రీ నివేదిక ప్రకారం సుమారుగా నిర్ధారించే వయసు ధ్రువీకరణ ఆధారంగా కలెక్టర్ అనుమతుల మేరకు ఉద్యోగ విరమణ చేయించారు. వీరిలోనూ సిబ్బందికి వేతనాలు చెల్లించే ఈఎంఎస్ పోర్టల్‌లో 65 ఏళ్లు పైబడి వయసు చూపించే వారినే వైద్య పరీక్షలకు పంపించారు. పలు ప్రాజెక్టుల్లో ఆయాలను బలవంతంగా ఉద్యోగ విరమణ చేయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వృద్ధులుగా కనపడే వారు, హుషారుగా పని చేయలేని వారిపై ఒత్తిడి తెస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఉద్యోగ విరమణ పొందిన వారు

జిల్లా	ఉపాధ్యాయినులు	ఆయాలు
నల్గొండ	58	168
సూర్యాపేట	10	57
యాదాద్రి	20	109

శ్రీనివాస్.. సేవల్లో శభాష్


అలువాల శ్రీనివాస్

చౌటుప్పల్, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై అంబులెన్సులో 'ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్'గా విధులు నిర్వహిస్తున్న చౌటుప్పల్‌కు చెందిన అలువాల శ్రీనివాస్ రక్తదాతగా, ఉచిత వైద్య శిబిరాల నిర్వాహకుడిగా, సామాజిక సేవకుడిగా కొన్నేళ్లుగా ప్రశంసలందుకుంటున్నారు. నల్గొండ జిల్లా తిప్పర్తి మండలం మామిడాలకు చెందిన అలువాల శ్రీనివాస్ కుటుంబం 2001లో చౌటుప్పల్‌కు వలసొచ్చింది. కోదాడలోని కేఆర్ఆర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తిచేసి సార్వత్రిక విద్యలో డిగ్రీ చదివారు. అమీర్‌పేటలోని మెడికల్ టెక్నాలజీ కళాశాలలో డీఎంఎల్టీ కోర్సు చదివాక అరబిందో ఫార్మాలో ఎనిమిదేళ్లు ఉద్యోగం చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఆకర్షితుడై ఉద్యోగాన్ని వదిలి ఉద్యమకారుడిగా మారారు. రాష్ట్రం ఏర్పాటయ్యాక మూడేళ్లపాటు ఆర్ఎంపీగా, సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం నేతగా సేవలందించారు. తర్వాత నార్కట్‌పల్లిలోని కామినేనిలో ఎమర్జెన్సీ డ్రగ్ డిపార్ట్‌మెంట్‌లో టెక్నీషియన్‌గా మళ్లీ ఉద్యోగంలో చేరి మూడేళ్లు పనిచేశారు. 2020లో జాతీయ రహదారిపై పంతంగి టోల్‌ప్లాజా ఆధ్వర్యంలో ఎన్‌హెచ్ఏఐ నిర్వహించే 1033 అంబులెన్సులో ఈఎంటీగా నాలుగేళ్లుగా సేవలందిస్తున్నారు.

ప్రత్యేకతలు ఇలా..

- అత్యవసర సమయంలో ఆపన్నుల కోసం 18 సార్లు రక్తదానం చేశారు.
- సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో 15 ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు.
- నాలుగేళ్లలో 1033 అంబులెన్సు ఈఎంటీగా సుమారు 2500 మంది రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి ఆస్పత్రికి తరలించారు.
- మానసిక స్థితి సరిగా లేక జాతీయ రహదారి వెంట తిరిగే ఇరవై మందిని చౌటుప్పల్‌లోని అనాథాశ్రమంలో చేర్పించారు.
- జీఎంఆర్-వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రోడ్డు భద్రత, అవగాహన శిబిరాల్లో పాల్గొని ప్రశంసలందుకున్నారు.

రైలు కిందపడి యువకుడి బలవన్మరణం

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: రైలు కింద పడి యువకుడు బలవన్మరణం చేసుకున్న ఘటన భువనగిరి మండల పరిధిలోని జమ్మాపురం పరిధిలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన మొలుగు సాయి(25) హైదరాబాద్‌లోని జీడిమెట్ల కంపెనీలో ఎలక్ట్రీషియన్‌గా పని చేసేవాడు. రాయగిరి-వంగపల్లి రైలు మార్గంలో మైలురాయి 248/7-5 వద్ద సోమవారం సాయంత్రం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడి తండ్రి గతంలో చనిపోయాడు. తల్లి, సోదరుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడి రిమాండ్

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: బాలసదన్‌లో 13 ఏళ్ల బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన జిల్లా న్యాయసేవాధికార సంస్థ అటెండర్ ఇ.వెంకటరెడ్డి(31)పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు భువనగిరి పట్టణ ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్ తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 14న సాయంత్రం 6:30 గంటలకు భువనగిరి బాల సదన్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆ సమయంలో వాష్‌రూంకు వెళ్లి వస్తున్న ఓ బాలికపై జిల్లా న్యాయసేవాధికార సంస్థ అటెండర్ వెంకటరెడ్డి అసభ్యంగా ప్రవర్తించడంతో ఆమె విలపించింది. విషయాన్ని బాలల పరిరక్షణ అధికారులకు బాధితురాలు తెలియజేయడంతో విచారణ చేపట్టారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై పోక్సో చట్టంలోని సెక్షన్ 7, 8 కింద కేసు నమోదు చేసి అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేటు న్యాయస్థానంలో సోమవారం హాజరుపర్చారు. నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు.

విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం


గుగులోత్ వెంకన్న

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో గిరిజన రైతు మృతిచెందిన ఘటన మండలంలోని గట్టికల్ శివారులో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పీపానాయక్‌తండాకు చెందిన గుగులోత్ వెంకన్న(46) గేదెలను తోలుకొని గట్టికల్‌కు చెందిన కోన రాంబాబు కోసిన వరిపొలం మీదుగా వెళ్తున్నాడు. రాంబాబు వ్యవసాయ క్షేత్రంలో పూర్తిగా కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు వెంకన్నకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే కొయ్యకాళ్లపై పడి మృతిచెందారు. ఆయన వెంట వస్తున్న ఓ కుక్క కూడా షాక్‌కు గురై చనిపోయింది. గేదెలు ప్రమాదం నుంచి తప్పించుకున్నాయి. మృతుడికి భార్య నీలా, ఒక కుమారుడు, కుమార్తె(వివాహమైంది) ఉన్నారు. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. బాధితుల నుంచి ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేస్తామని ఏఎస్ఐ శంకర్‌నాయక్ తెలిపారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి


ఖమ్మంపాటి మునీశ్వర్

నాగారం, న్యూస్‌టుడే: ఈతకు వెళ్లి ఓ బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని వర్ధమానుకోటలో చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఖమ్మంపాటి నాగరాజు-ఉపేంద్ర దంపతుల పెద్ద కుమారుడు ఖమ్మంపాటి మునీశ్వర్(11) స్నేహితులతో కలిసి ఆదివారం మధ్యాహ్నం బిక్కేరు వాగులో ఈతకు వెళ్లి నీటి ఉద్ధృతిలో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. మిత్రులు భయభ్రాంతులకు లోనై ఎవరింటికి వారు వెళ్లారు. చీకటి పడినా బాలుడు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు అనుమానంతో అతని స్నేహితులను ఆరా తీసినా ఏమీ చెప్పలేదు. పోలీసులు మందలించడంతో వాగులో మునిగిపోయినట్లు చెప్పారు. సోమవారం బాలుడి తల్లిదండ్రులు, బంధువులు గాలించగా మృతదేహం లభ్యమైంది. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఐలయ్య తెలిపారు.

అమ్మమ్మ ఇంట్లో అంత్యక్రియలు రెండేళ్ల క్రితం బాలుడి తాత ఖమ్మంపాటి యాదగిరికి రెండు కిడ్నీలు పాడవగా ఉన్న ఇంటిని అమ్మి వైద్యం చేయించారు. ప్రస్తుతం ఆ కుటుంబం అద్దె ఇంట్లో ఉంటోంది. నాగారం(బంగ్లా)లో బాలుడి అమ్మమ్మ ఇంటికి మృతదేహాన్ని తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00

కోదాడ

•కోదాడ •హుజూర్‌నగర్

కార్మికులకు చేసిన వాగ్దానాలు అమలు చేయాలి: సీఐటీయూ

మోతె, న్యూస్‌టుడే: కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామంటూ ఎన్నికల్లో వాగ్దానాలు చేసి గెలిచి పది నెలలు కావొస్తున్నా అమలుకు నోచుకోలేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్‌.రాధాకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. రోజు రోజుకూ కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. అధికారంలోకి రాకముందు కాంగ్రెస్‌ సమ్మె సందర్భంగా పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్‌ చేశారు. సమస్యలపై స్పందించకపోతే ఐక్యపోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. రవిచంద్ర, శ్రీనివాస్‌, వెంకటేశ్వర్లు, సైదులు, తదితరులు పాల్గొన్నారు. సరళ ధరలతో కార్మిక కుటుంబాలు తీవ్ర ఆర్థిక

మహా రుద్రాభిషేకం పనుల ప్రారంభం

హుజూర్‌నగర్‌, న్యూస్‌టుడే: మహా రుద్రాభిషేకం పనులను కమిటీ సభ్యులు ప్రారంభించారు. సోమవారం కమిటీ సభ్యులు కొబ్బరికాయలు కొట్టి పనులను మొదలు పెట్టారు. మహా రుద్రాభిషేకం కార్యక్రమంలో ప్రజలంతా బంధుమిత్రులతో పాల్గొనాలని కోరారు. ప్రభాకర్‌, నరసింహారావు, నాగేశ్వరరావు, విజయ్‌, శ్రీనివాస్‌, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

★ ఈనెల 27న హుజూర్‌నగర్‌ ఎస్సెస్సీ క్యాంపు ఉన్నత పాఠశాల ఆవరణలో నాగ సాధువుల ఆధ్వర్యంలో జరిగే మహా రుద్రాభిషేకం, మహా భస్మాభిషేకం, లక్ష రుద్రాక్షల అభిషేకం కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ కమిటీ సభ్యులు కోదాడలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిని కలిసి ఆహ్వానించారు.



పనులను ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు

రైతులపై ముప్పేట దాడి

హుజూర్‌నగర్‌, న్యూస్‌టుడే:

ఈసారి వానాకాలం సీజన్‌ ఆసాంతం రైతులు ముప్పతిప్పలు పడుతున్నారు. అతి వర్షాలు, కాలువలకు గండ్లు, పంటకు తెగుళ్లు, ఎలుకల దాడితో సతమతమవుతున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా వర్షాలు పడటంతో ఎడమ కాలువకు గండి పడి దాదాపు 20 రోజులు సాగు నీరు లేకుండా పోయింది. అప్పుడే నాట్లు వేసిన రైతులు సాగు నీరు విడుదల కాక నానా తిప్పలు పడ్డారు. ఎట్టకేలకు కాలువ గండ్లు పూడ్చి సాగునీరు విడుదల లైందని రైతులు ఊపిరి పీల్చుకుంటున్న సమయంలో మళ్లీ రోజా వర్షాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండ, వానలు దాదాపు నిత్య కృత్యం కావడంతో తెగుళ్ల

రోజా వర్షంతో..

ఆయకట్టు ప్రాంతంలో రోజా వర్షాలు పడుతుండటంతో వివిధ దశలలో ఉన్న వరి పంటలపై ప్రభావం చూపుతుంది. ఇప్పటికే ముందు నాటు వేసిన వారు కోతలు కోయడానికి భయపడుతున్నారు. వర్షం పడి ధాన్యం తడుస్తుందని ఆకాశం ఎప్పుడు నెమ్మదిస్తుందా అని ఎదురు చూస్తున్నారు. వరస తుపానులతో రోజా ఏదో ఒక సమయంలో వర్షం పడుతోంది. ముఖ్యంగా ఎక్కువ వరి పొలగింజ పోసుకుంటున్న దశలో ఉంది. వర్షం పడటం వల్ల పొలగింజ దెబ్బతిని తాలు గింజగా మారుతుందని రైతులు అంటున్నారు. కొన్ని ప్రాంతాలలో వరి పూర్తిగా పడిపోయి పాచిపోతున్న పరిస్థితి ఉంది. చేతికి అందిందనుకున్న పంటపై ఇన్ని రకాల దాడులు జరుగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



హుజూర్‌నగర్‌లో తెగులు సోకిన వరి

దాడి చేశాయి. కాలువలకు గండ్లు పడి సాగు నీరు విడుదల కాక వరి పంటలపై ప్రభావం చూపుతుందని అనుకుంటున్న క్రమంలో తెగుళ్లు కూడా వచ్చాయి. దీంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే ఉంటుందని రైతులు అంటున్నారు. తెగుళ్లను అదుపులోకి తీసుకు రావడానికి అయిన ఖర్చులు రైతులకు భారంగా మారాయి. ఇలా ఉండగానే ఈ సారి ఎలుకలు కూడా అధికంగానే పొలాల మీద దాడికి వచ్చాయి. అవి కూడా కొంత నష్టం చేశాయి. ముక్త్యాల బ్రాంచి కాలువ పరిధిలో దాదాపు 1.25 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా దాదాపు ప్రతి రైతు ఏదో ఒక రకంగా ఇబ్బంది పడుతున్నవారే.

నిందితులను శిక్షించాలని డిమాండ్‌

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: హిందువులు, హిందూ దేవాలయాలపై దాడులకు పాల్పడితే సహించేది లేదని విశ్వ హిందూ పరిషత్‌, భజరంగ్‌దళ్‌ నాయకులు అన్నారు. సికింద్రాబాద్‌ ముత్యాలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ సోమవారం ర్యాలీ నిర్వహించారు. దేవాలయాలపై ఉద్దేశ పూర్వకంగా దాడులు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఘటనను సంబంధించి శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై పోలీసులు లాఠీ ఛార్జి చేయడం అమానుషమని, లాఠీ ఛార్జి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలన్నారు. నిందితులను శిక్షించాలని డిమాండ్‌ చేశారు. భజరంగదళ్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట్‌, విశ్వ హిందూ పరిషత్‌ జిల్లా అధ్యక్షుడు ఉపేందర్‌, పట్టణ అధ్యక్షుడు విజయ్‌, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వ హిందూ పరిషత్‌, భజరంగ్‌దళ్‌ నాయకులు

ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించండి



కోదాడ: ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

కోదాడ, న్యూస్‌టుడే: ఆస్పత్రిలో రోగులకు, బాలింతలకు, గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. పట్టణంలోని సామాజిక వైద్యశాలను తనిఖీ చేసి ఆమె మాట్లాడారు. వైద్యం ఎలాం అందుతుందో రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి సరిపడా వైద్యులు వచ్చేలా వైద్య శాఖ కమిషనర్‌తో మాట్లాడతానన్నారు. స్కానింగ్‌, రక్త పరీక్ష యంత్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఆపరేషన్‌ థియేటర్‌లో సరిపడా వస్తువులు మంజూరు చేయిస్తానన్నారు. త్వరలోనే 100 పడకల నిర్మాణ పనులు మొదలు పెడతామన్నారు.

నడిగూడెం, న్యూస్‌టుడే: గ్రామాల్లో సమస్యలు పరిష్కరించి మండలాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో పాల్గొన్నారు. నడిగూడెంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించే నూతన గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేశారు. నడిగూడెం, బృందావనపురం, రత్నవరం గ్రామాల్లో రూ.10 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. నడిగూడెం ప్యాక్స్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సన్నరకం ధాన్యం తేమ శాతాన్ని 17 వరకు పెంచాలని, ప్యాక్స్‌ ఆధ్వర్యంలో మరో రెండు కొనుగోలు కేంద్రాలను మంజూరు చేయాలని స్థానిక రైతులు, ప్యాక్స్‌ ఛైర్మన్‌ కె.రామారావు ఎమ్మెల్యేను కోరారు.

★ నడిగూడెం కేవీఎన్‌ ప్రభుత్వ జూనియర్‌ కళాశాల విద్యార్థులకు హాస్టల్‌ వసతి కల్పించాలని, బస్సు సౌకర్యంతో పాటు, కళాశాలలో సీసీ రహదారి, ప్రహరీ నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ప్రిన్సిపల్‌ డి.విజయనాయక్‌ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు.

★ మండల తెదేపా అధ్యక్షుడు డి.శ్రీనివాస్‌ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు. సోమవారం బృందావనపురంలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి వచ్చిన ఎమ్మెల్యే పద్మావతి ఆయనను పరామర్శించారు. నడిగూడెంలో ఇటీవల మృతి చెందిన పార్టీ సీనియర్‌ కార్యకర్త ఎం.ప్రతాపరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మునగాల: మునగాల మండలంలో స్కిల్‌ డెవలప్‌మెంట్‌ సెంటర్‌ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్‌ పార్టీ నాయకులు జైపాల్‌రెడ్డి, సైదులు, కోటేశ్వరరావు, బుచ్చిపాపయ్య, వీరబాబు కోదాడలోని క్యాంప్‌ కార్యాలయంలో ఎమ్మెల్యే పద్మావతికి వినతి పత్రం అందజేశారు.

పోలీసుల త్యాగాలు మరువలేనివి



గరిడేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



హుజూర్‌నగర్‌: శాంతి స్తూపం వద్ద పోలీసు అమరవీరులకు నివాళి అర్పిస్తున్న ఎస్సై ముత్తయ్య, పోలీసులు



మేళ్లచెరువు కేజీబీవీలో విద్యార్థుల నివాళి

గరిడేపల్లి, న్యూస్‌టుడే: శాంతిభద్రతలను పరిరక్షించడంలో పోలీసుల త్యాగాలు మరువలేనివని ఎస్సై చలికంటి నరేష్‌ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా కీతవారిగూడెం పాఠశాల విద్యార్థులకు పోలీసుల విధులు, వారి త్యాగాలను వివరించారు. ముందుగా ర్యాలీ నిర్వహించారు.

హుజూర్‌నగర్‌: సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ ముత్తయ్య ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా శాంతి స్తూపం వద్ద నివాళి అర్పించారు. అమరవీరుల సంస్మరణ దినం, పోలీసు ఫ్లాగ్‌డే వేడుకలను నిర్వహించారు. శాంతి భద్రతలను కాపాడటానికి ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పనిచేసిన అమరవీరుల స్ఫూర్తితో బాధ్యతలు నిర్వహిస్తామని ఎస్సై తెలిపారు.

నడిగూడెం: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీసాయిపబ్లిక్‌ స్కూల్‌ విద్యార్థులు నివాళి అర్పించారు.

పాఠశాలను సందర్శించి.. సూచనలు ఇచ్చి

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. సోమవారం నడిగూడెం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాలలో అంతర్గత సిమెంటు రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం, ప్రహరీ ఎత్తు పెంచే పనులకు నిధులు మంజూరు చేస్తానన్నారు. వచ్చే నెలలో నిర్వహించే జోనల్‌మీట్‌కు అవసరమైన సహకారం అందిస్తామన్నారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

-నడిగూడెం, న్యూస్‌టుడే:



పల్లె ఒడి.. సాగు బడి



కేవీకే ఆధ్వర్యంలో గ్రామీణ కృషి అనుభవంపై గ్రామ పటం ద్వారా వివరిస్తున్న విద్యార్థులు

గరిడేపల్లి, న్యూస్‌టుడే: పంట సాగులో బీఎస్సీ విద్యార్థులు మెలకువలు నేర్చుకుంటూ.. రైతులకు నేర్పుతూ తమ గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వివిధ యూనివర్సిటీలు, వాటి పరిధిలోని అనుబంధ కళాశాలల్లో చదివే బీఎస్సీ చివరి సంవత్సరం విద్యార్థులు మూడు నెలల పాటు గ్రామీణ ప్రాంతాలలో అన్నదాతలతో మమేకమై వారి అనుభవాలను తెలుసుకుంటూ వారు తరగతి గదుల్లో నేర్చుకున్న అంశాలను రైతులకు వివరిస్తున్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం, యంత్రాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో వారి అనుభవాలను క్రోడీకరించుకుంటూ ఎప్పటికప్పుడు కేవీకే శాస్త్రవేత్తలతో తమ సందేహాలను నివృత్తి చేసుకుంటున్నారు. గత రెండు నెలలుగా రైతులతో కలిసి సాగులో పాల్గొంటున్నారు. వారు గుర్తించిన తెలుసుకున్న అంశాలు వివరించారు. రైతులు వారు ఎంచుకున్న పత్తి, వరి, మిర్చి, కంది కూరగాయల పంటలను ఇష్టంతో చేస్తున్నారు. ఫలితం ఆశించినట్లు రాకపోతే తీవ్ర నిరాశకు లోనైనా తిరిగి అదే సాగుకు ఉపక్రమిస్తున్నారని సికింద్రాబాద్‌ లయోల, మధ్యప్రదేశ్‌లోని ఓరియంటల్‌ యూనివర్సిటీ విద్యార్థులు గుర్తించారు.

దిగుబడి పెంచితే లాభసాటి: లిఖిత, కరీంనగర్‌



పుస్తకాల్లో నేర్చుకునే అంశాలు చాలా పాతవి. ఇపుడు వస్తున్న వంగడాలు, పురుగు మందులు, సేంద్రియ పద్ధతులు, యంత్రాల వినియోగం పూర్తిగా భిన్నంగా ఉంటున్నాయి. రైతులు ఒక ఉపాధ్యాయునిగా, శాస్త్రవేత్తగా కన్పిస్తున్నారు. ఎన్నో కొత్త విషయాలు స్వయంగా తెలుసుకుంటున్నారు. రసాయనాలు, పురుగుమందులు తగ్గిస్తే బాగుంటుంది. పెట్టుబడి తగ్గించుకుంటూ దిగుబడి పెంచితే సాగు లాభసాటిగా మారుతుంది.

రైతుల్లో అవగాహన రావడం లేదు: వైష్ణవి, హైదరాబాద్‌



రైతుల్లో విత్తనాల ఎంపిక, విత్తన శుద్ధి, సేంద్రియ సాగుపై పూర్తిగా అవగాహన రావడం లేదు. పోషకాల లభ్యత, మోతాదులో వాడకం సరిగా లేదు. దాదాపు 80 శాతం మంది డీలర్లపైనే ఆధారపడుతున్నారు. తెగుళ్లను, పురుగులను, వాతావరణ మార్పులను ఒకే రీతిలో చూస్తున్నారు. పొలం ఎర్రబడిందంటే రోగం అన్నట్లే భావిస్తున్నారు. దేనివల్ల ఎర్రగా మారిందో తెలుసుకోకుండానే ఎడాపెడా మందులు వాడుతున్నారు. ఇది సరైన పద్ధతి కాదు.

రాత్రి నృత్యం చేసి.. తెల్లవారుజామున విగతజీవిగా మారి

నడిగూడెం, న్యూస్‌టుడే: బాల్య మిత్రుడి వివాహ వేడుకలో పాల్గొని రాత్రి వరకు నృత్యం చేసి, ఆనందంగా గడిపిన యువకుడు తెల్లవారే సరికి మృతిచెందిన ఘటన సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం సిరిపురం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం..



గ్రామానికి చెందిన **కె.సతీష్‌**(30) కోదాడలో నెట్‌ సెంటర్‌ నిర్వహిస్తున్నారు. ఆదివారం గ్రామంలో స్నేహితుడి వివాహ వేడుకలో డీజే పాటలకు నృత్యం చేశారు. రాత్రి ఇంటికి వచ్చి నిద్రించి అలాగే మృతి చెందారు. గుండెపోటుతో మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు. సతీష్‌కు భార్య, 13 నెలల కుమారుడు ఉన్నారు. తండ్రి మరణించిన విషయం తెలుసుకోలేని చిన్నారిని పట్టుకొని కుటుంబ సభ్యులు రోదించడం చూసి స్థానికులు కంటతడి పెట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: ఖమ్మం-కోదాడ జాతీయ రహదారిపై నేలకొండపల్లి మండలం గువ్వలగూడెం వద్ద సోమవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం దొరకుంట గ్రామానికి చెందిన లింగరాజు, వెంకటేశ్వర్లు ఖమ్మం వైపు బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని ఆటో వారి వాహనాన్ని ఢీకొంది. బైక్‌పై ఉన్న ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో క్షతగాత్రుల్ని ఖమ్మం ప్రధానాసుపత్రికి తరలించారు.

భద్రతా నియమాలతోనే ప్రమాదాల నివారణ

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: భద్రతా నియమాలను అందరూ పాటిస్తేనే ప్రమాదాలను నివారించడం సాధ్యమని దక్కన్‌ సిమెంట్‌ సంస్థ వైస్‌ ప్రెసిడెంట్‌ (వర్క్స్‌) ఎన్‌.శ్రీనివాసరాజు, చీఫ్‌ జనరల్‌ మేనేజర్‌ ఎస్‌.నాగమల్లేశ్వరరావు ఉద్బోధించారు. పాలకవీడు మండలంలోని దక్కన్‌ సిమెంట్స్‌ కర్మాగారం ఆవరణలో సోమవారం గనుల భద్రతా వారోత్సవాలను జెండా ఆవిష్కరించి ప్రారంభించిన అనంతరం కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు.



జెండావిష్కరిస్తున్న వైస్‌ ప్రెసిడెంట్‌(వర్క్స్‌) ఎన్‌.శ్రీనివాసరాజు, చీఫ్‌ జనరల్‌ మేనేజర్‌ ఎస్‌.నాగమల్లేశ్వరరావు

రుణమాఫీని పూర్తి స్థాయిలో అమలు చేయండి

మఠంపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రకటించిన విధంగా రూ.2 లక్షల రుణమాఫీని పూర్తి స్థాయిలో అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పాండూనాయక్‌ డిమాండ్‌ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మఠంపల్లి తహసీల్‌ కార్యాలయం వద్ద ధర్నా చేసిన అనంతరం తహసీల్దార్‌ మంగకు వినతి పత్రాన్ని అందజేసి మాట్లాడారు. రైతు బంధు నిధులు విడుదల చేయాలని కోరారు. మండల కార్యదర్శి బాలూనాయక్‌, పి.రాము, ఆలీబాబా, శంభయ్య, మంగ్తా తదితరులు పాల్గొన్నారు.

కవితా గానంపై ఉపాధ్యాయుడికి సత్కారం

మోతె, న్యూస్‌టుడే: పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఆదివారం నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహితీ కళాజాత కార్యక్రమంలో కవితాగానం చేసిన ఉపాధ్యాయుడు చిట్యాల ఉపేందర్‌కు ఘన సత్కారం లభించింది. మండలంలోని నామవరం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు ఇటీవల 24 గంటలపాటు నిర్వహించిన కళాజాత కార్యక్రమంలో కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్‌ నేతృత్వంలో రికార్డు సర్టిఫికెట్‌తో పాటు జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు. కళావేదిక సమన్వయకర్త రమావతి, భూషణం, వీరాచారి, కవులు వెంకన్న, జార్జ్‌ పాల్గొన్నారు.



చిట్యాల ఉపేందర్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

నేడు ఉచిత వైద్య శిబిరం

నడిగూడెం, న్యూస్‌టుడే: సూర్యాపేట లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో మంగళవారం నడిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్‌ ఛైర్మన్‌ దోసపాటి గోపాల్‌, ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్‌, ఏవో పి.నర్సింహారెడ్డిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎస్టీయూ అడహక్‌ కమిటీ ఏర్పాటు

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) మండల నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడిగా పాయిలి నాగార్జున, ప్రధాన కార్యదర్శిగా కె.సత్యనారాయణ ప్రసాద్‌లను ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓరుగంటి నాగేశ్వరరావు, బంధం వెంకటేశ్వర్లు తెలిపారు.



నాగార్జున



సత్యనారాయణ

దివ్యాంగులకు బస్‌పాస్‌ మేళా

హుజూర్‌నగర్‌ గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పాత బస్టాండ్‌లో దివ్యాంగులకు కోదాడ డిపో అధికారులు బస్‌పాస్‌ మేళాను సోమవారం నిర్వహించారు. అర్హులైన దివ్యాంగులకు 50 శాతం రాయితీపాసులను అందించారు. ఆర్టీసీ అధికారులు షేక్‌ అబ్దుల్‌, ఆర్‌.సీతయ్య పాల్గొన్నారు.

అతిసార వ్యాధితో పలువురికి అస్వస్థత

చింతలపాలెం, న్యూస్‌టుడే: చింతలపాలెంలో మళ్లీ అతిసార కేసులు నమోదయ్యాయి. గత కొన్ని రోజుల కిందట ఈ గ్రామంలోని ఓ కాలనీలో అతిసార కేసులు నమోదైన నేపథ్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి నివారణ చర్యలు చేపట్టారు. ఈ కేసులు తగ్గుముఖం పట్టగానే ఇదే గ్రామంలో మరో వైపు మళ్లీ ఆరు కేసులు నమోదయ్యాయి. వీరిలో ఇద్దరు మరీ నీరసించడంతో వారిని హుజూర్‌నగర్‌ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వ్యాధి లక్షణాలు తక్కువగా ఉన్నవారికి చింతలపాలెంలో వైద్య చికిత్సలు అందిస్తున్నారు. పైపు లైను ద్వారా వచ్చే నీటినే ఈ ప్రాంత వాసులు తాగుతున్నట్టు వైద్యులు గుర్తించి ఆ నీటిని పరీక్షలకు పంపారు. ప్రాథమిక పరీక్షలో ఆ నీరు కలుషితమవుతున్నట్టు అనుమానించిన తర్వాత పూర్తి స్థాయిలో నీటిని పరీక్షించేందుకు శాంపిళ్లను నల్గొండ పంపినట్టు వైద్యులు తెలిపారు. తాజాగా వ్యాధి బాధితులున్న ప్రాంతంలోని నీటినీ పరీక్షించేందుకు ఎపిడిమియోలజిస్టు మంగళవారం చింతలపాలెం రానున్నట్టు వైద్య బృందం తెలిపింది.

అవీ ఇవీ

తనిఖీ.. నడిగూడెం: తెల్లబల్లి కాంప్లెక్స్‌ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల నిర్వహణను సోమవారం కాంప్లెక్స్‌ ఛైర్మన్‌ పద్మావతి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చాకిరాల, శ్రీరంగాపురం, రత్నవరం పాఠశాలలను తనిఖీ చేసి, విద్యార్థులకు నిర్వహిస్తున్న ఎస్‌ఏ-1 పరీక్షల తీరును పరిశీలించారు. వెంటనే మూల్యాంకనం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి.. నేరేడుచర్ల: కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఎం పాలకవీడు మండల కార్యదర్శి కె.అనంతప్రకాశ్‌ కోరారు. పాలకవీడులో సోమవారం జరిగిన పార్టీ సమావేశంలో మాట్లాడారు.

డిమాండ్‌.. నేరేడుచర్ల: అర్హులైన వారందరికీ పీఎం విశ్వకర్మ పథకం వర్తింపజేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనుంజయనాయుడు డిమాండ్‌ చేశారు. నేరేడుచర్లలో సోమవారం కార్పెంటర్‌ వర్కర్స్‌ యూనియన్‌ సమావేశంలో మాట్లాడారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శంకరాచారి, ప్రధానకార్యదర్శిగా జానకి రామాచారి, కోశాధికారిగా సురేంద్రాచారి ఎన్నికయ్యారు.

నేరేడుచర్ల: పాలకవీడు మండలపరిధిలో ఉన్న దక్కన్‌, పెన్నా సిమెంట్స్‌లో స్థానికులకు ఉద్యోగాలివ్వాలని గిరిజన శక్తి రాష్ట్ర కార్యదర్శి మధు నాయక్‌ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్‌ చేశారు.

వినతి.. కోదాడ: వయో వృద్ధుల సంరక్షణ చట్టాన్ని అమలు చేయాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ అన్నారు. సోమవారం ఆర్డీవో సూర్యనారాయణకు వినతి పత్రం అందజేసి మాట్లాడారు.

నడిగూడెం: పెంచిన నిత్యావసర ధరలను వెంటనే తగ్గించాలని, రైతుబంధు నిధులు విడుదల చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నడిగూడెం తహసీల్‌ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం వినతి పత్రం అందజేశారు. పార్టీ మండల కార్యదర్శి బి.సత్యనారాయణ, బి.వెంకటేశ్వర్లు, వై.వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

నివాళి.. హుజూర్‌నగర్‌ గ్రామీణం: కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నాయకుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు కుక్కడపు కాశయ్య సతీమణి మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్‌ కుక్కడపు గురవమ్మ మృతికి వివిధ సంఘాల నాయకులు సోమవారం నివాళి అర్పించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్‌రావు పార్టీ జెండాను కప్పి నివాళి అర్పించారు. గౌడ సొసైటీ అధ్యక్షుడు కృష్ణ, షేక్‌ సైదా, సైదులుగౌడ్‌, హుస్సేన్‌గౌడ్‌, తదితరులు పాల్గొన్నారు.

మద్యం ధ్వంసం.. గరిడేపల్లి: శాసనసభ, లోకసభ ఎన్నికల సమయంలో పోలీసుల తనిఖీల్లో పట్టుకున్న మద్యాన్ని గరిడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ధ్వంసం చేసినట్లు ఎస్సై చలికంటి నరేష్‌ తెలిపారు. ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ అనుమతితో క్వార్టర్‌ సీసాలు, బీర్లు సుమారు 185 లీటర్లు, 111 లీటర్ల నాటు సారాను పారబోశారు. ఎక్సైజ్‌ ఎస్సై వెన్నెలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

నియామకం.. కోదాడ పట్టణం: బహుజన సమాజ్‌ పార్టీ కోదాడ నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా మునుగోటి అంజిని నియమించినట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామారావు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామగ్రామాన బీఎస్పీని బలోపేతం చేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

అధికారులు స్పందించడం లేదు.. మునగాల: మండల కేంద్రంలోని పలు సమస్యలపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారుల స్పందన కరవైందని గ్రామస్థుడు రాయల కృష్ణ ఆరోపించారు. జిల్లా కేంద్రంలో సోమవారం గ్రీవెన్స్‌లో పలు సమస్యలపై జిల్లా పాలనాధికారికి దరఖాస్తు అందజేసినట్టు చెప్పారు. ఆర్‌అండ్‌బీ రహదారి విస్తరణ జరపడంలో నిర్లక్ష్యం, తహసీల్దార్‌, ఎంపీడీవోకి పలు రకాల సమస్యలపై దరఖాస్తు చేసుకొన్నా వివరణ ఇవ్వకపోవడం, గ్రామంలో సీసీ రహదారుల నిర్మాణంలో అవకతవకల గురించి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

సాయం.. మేళ్లచెరువు: మేళ్లచెరువులో తలసెమియా వ్యాధితో బాధపడుతున్న ఈశ్వర్‌ ప్రసాద్‌ అనే బాలుడి కుటుంబానికి ఎంజీఎం ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో రూ.30 వేల నగదును అందజేసినట్టు ఫౌండేషన్‌ అధ్యక్షుడు సలీం తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి.. కోదాడ పట్టణం: విద్యార్థినులు కార్యశాలను సద్వినియోగం చేసుకోవాలని రిసోర్స్‌పర్సన్‌ శరత్‌చంద్ర అన్నారు. కిట్స్‌ కళాశాలలో బీటెక్‌ తృతీయ సంవత్సర విద్యార్థినులకు సోమవారం కార్యశాల నిర్వహించారు. 'మాట్లాబ్‌ అండ్‌ సీమూలింక్‌' అనే అంశంపై విద్యార్థినులను అవగాహన కల్పించారు.

108లో ప్రసవం.. మునగాల గ్రామీణం: 108లో మహిళ ప్రసవించిన సంఘటన ముకుందాపురంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన యల్లమ్మకు పురిటి నొప్పులు రావడంతో 108కు సమాచారం అందించారు. సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో సూర్యాపేట శివారులోని శాంతినగర్‌ వద్ద మగబిడ్డకు జన్మనిచ్చినట్లు తెలిపారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉండటంతో ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

సినిమాలు

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

విష్ణురామ్‌: దేవర, వేట్టయన్‌, **శ్రీనివాస:** దేవర, **కాన్‌ప్లెక్స్‌:** వేట్టయన్‌, విశ్వం, **రంగా:** వేట్టయన్‌, **వెంకటేశ్వర:** విశ్వం

నోములకు టీచింగ్‌ ఎక్సలెన్సీ అవార్డు

హుజూర్‌నగర్‌, న్యూస్‌టుడే: ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఏటా రాష్ట్రంలోని ఉత్తమ ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు ఇచ్చే టీచింగ్‌ ఎక్సలెన్సీ అవార్డు.. ఈసారి హుజూర్‌నగర్‌కు చెందిన సహ ఆచార్యుడు, తెలంగాణ సైకాలజిస్ట్‌ అసోసియేషన్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నోముల వెంకటేశ్వర్లుకు దక్కింది. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ అవార్డును పద్మశ్రీ కేతావత్‌ సోమ్లా, ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్‌ మునిష్‌ జిందాల్‌ ప్రదానం చేశారు. వెంకటేశ్వర్లును పట్టణ ప్రముఖులు, పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆపోపా, మిల్లర్స్‌ అసోసియేషన్‌ నాయకులు, వర్తక సంఘం సభ్యులు అభినందించారు.



హైదరాబాద్‌లో వెంకటేశ్వర్లుకు అవార్డు అందజేస్తున్న శారద ఎడ్యుకేషనల్‌ సొసైటీ సభ్యులు

సూర్యాపేట

• సూర్యాపేట • తుంగతుర్తి

సన్మానం



అర్వపల్లిలో తహసీల్దార్ శ్రీనివాసులును సన్మానిస్తున్న నాయకులు

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఇటీవల గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా ప్రతిభా పురస్కారం అందుకున్న జాజిరెడ్డిగూడెం తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులును అర్వపల్లిలో తహసీల్ కార్యాలయంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. దిర్శనపు కృష్ణమూర్తి, కొమారి మల్లయ్య, పందిరి సురేందర్, భద్రారెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

భానుపురి, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని గొల్లగూడ కాలనీలో రహదారులపై చెత్త పారబోస్తున్నారు. అపరిశుభ్రంగా మారడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. – మల్లయ్య, గొల్లగూడకాలనీ

✔ నిర్వాహకులతో మాట్లాడి సమస్య లేకుండా చూస్తాం. – సారగండ్ల శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సూర్యాపేట

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM) సూర్యాపేట: 9154395978 తుంగతుర్తి: 80085 74450

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని జాకీర్‌హుస్సేన్‌నగర్‌లో వీధి దీపాలు వెలగటం లేదు. రాత్రి అంధకారం నెలకొని కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. – వెంకన్న, జాకీర్‌హుస్సేన్‌నగర్

✔ సిబ్బందికి చెప్పి వెలిగేలా చూస్తాం. – శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

గాలికుంటు టీకాలు సద్వినియోగం చేసుకోండి

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: గాలికుంటు వ్యాధి వల్ల పశువుల్లో పాల దిగుబడి తగ్గడమే కాకుండా నీరసించిపోతాయని పశుసంవర్ధకశాఖ సూర్యాపేట సహాయ సంచాలకులు డా. బి.వెంకన్న అన్నారు. ఆత్మకూర్(ఎస్) మండలంలో నిర్వహిస్తున్న ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో భాగంగా నెమ్మికల్‌లో సోమవారం ఆయన సందర్శించి పర్యవేక్షించారు. రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతం నెమ్మికల్ పశువైద్యఉపకేంద్రాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. మండల పశువైద్యాధికారి వేణుగోపాలరావు, సిబ్బంది చిరంజీవి, హరీష్, కృష్ణప్రసాద్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

జాజిరెడ్డిగూడెం: మండలంలోని వేల్పుచర్లలో పశువులకు సోమవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పంపిణీ చేశారు. డాక్టరు అర్జున్, వీఎల్‌వో పద్మ, సిబ్బంది యాకయ్య, మధుసూదన్ పాల్గొన్నారు.

తుంగతుర్తి: గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం అందించిన టీకా మందును రైతులు తమ పశువులకు వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ నరేష్ పేర్కొన్నారు. సోమవారం అన్నారంలో శిబిరంలో పశువులకు టీకా మందు ఇచ్చారు. రవికుమార్, గోపాలమిత్ర శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛమైన నీటిని అందించండి

తుంగతుర్తి, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రజలకు రక్షిత మంచినీటి ట్యాంకుల ద్వారా సరఫరా అయ్యే నీటిని స్వచ్ఛంగా అందించాలని తుంగతుర్తి గ్రామీణ రక్షిత మంచినీటి సరఫరా శాఖ డీఈ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మంచినీటి సరఫరా సహాయకుల శిక్షణ కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. చేతి పంపుల నిర్వహణ, మరమ్మతులు, నీటి నాణ్యతను పరిశీలించే విధానం గురించి అవగాహన కల్పించారు. ఏఈలు జాన్‌ఫ్రెడ్, చందన, అశోక్, నవీన్, ఎంపీవో శ్రీధర్, పాల్గొన్నారు.

వానొస్తే పంటనష్టం.. రాకపోకలకు ఆటంకం



చీదెళ్ల శివారులో మాధవరం రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు (పాతచిత్రం)

లోలెవల్ కాజ్‌వేతో రైతులకు ఇబ్బందులు

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: మండలంలోని చీదెళ్ల శివారులో మాధవరం వెళ్లే రహదారిపై, అనంతారం - పొట్లపహాడ్ గ్రామాల మధ్య ఉన్న కాజ్‌వేల వద్ద కల్వర్టులు నిర్మించకపోవడంతో వాహదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో ఉద్ధృతంగా వరదనీరు ప్రవహించడంతో ప్రజల రాకపోకలు నిలిచిపోతున్నాయి. కాజ్‌వేకు రోడ్డుకిరువైపులా సాగుచేసిన వందలాది ఎకరాలు వరిపొలాలు నీటిలో మునిగిపోయి తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

☛ చీదెళ్ల నుంచి మాధవరం వైపునకు వెళ్లే రహదారిపై కాజ్‌వే ప్రదేశంలో కూడా ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి పూర్తిగా కోతకు గురైంది. సమీప గ్రామాల ప్రజలు రాకపోకలు నిలిచిపోయి ఏటా అవస్థలు పడుతున్నారు.

☛ పొట్లపహాడ్ - అనంతారం మధ్య కాజ్‌వే వద్ద వరదనీటి కారణంగా వరి పొలాలు దెబ్బతినిపోయి రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. వరదనీటి కారణంగా అంతరాయం ఏర్పడకుండా ఎత్తైన కల్వర్టులు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

☛ 'మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామ'ని ఆర్‌అండ్‌బీ ఏఈ యుగంధర్ తెలిపారు. వరదనీటి కారణంగా రాకపోకలు నిలిచిపోతున్న కాజ్‌వేల ప్రదేశంలో కల్వర్టుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని పైఅధికారులను కోరతామని చెప్పారు.



పొట్లపహాడ్ శివారులో కాజ్‌వే ప్రదేశంలో నీట మునిగిన వరి పొలాలు (పాతచిత్రం)

మాలమహానాడు కార్యవర్గం ఎన్నిక


నాగారం, న్యూస్‌టుడే: ఫణిగిరిలో మాలమహానాడు కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోరెంట్ల సామేల్, ఉపాధ్యక్షుడిగా యాట ప్రకాశ్, ప్రధాన కార్యదర్శిగా ఇటుక ప్రసాద్, కార్యదర్శిగా కర్నె అఖిల్, కోశాధికారిగా కడారి మల్లయ్య, కార్యవర్గ సభ్యులుగా చిలుకూరి జయరాజ్, సామేలు, జాన్‌వెస్లీ, చిరంజీవి, వెంకన్న, అబ్రహం, సురేశ్, స్వామిదాస్, యాకోబ్, భాస్కర్, శేఖర్, చరణ్, రాజమల్లు ఎన్నికయ్యారు.

రేషన్ డీలర్ సస్పెన్షన్

తిరుమలగిరి, న్యూస్‌టుడే: తిరుమలగిరి పౌరసరఫరాల దుకాణం-2లో అవకతవకలు జరిగినట్లు గుర్తించిన సివిల్‌సప్లయ్ డీటీసీఎస్ విజయ్‌శేకర్ సోమవారం సదరు డీలర్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఈనెల 16న పీడీఎస్ బియ్యం వ్యాపారులతో కలిసి ఐదు క్వింటాళ్ల బియ్యం విక్రయిస్తుండగా స్థానిక ఎస్సై వి.సురేశ్ పట్టుకుని కేసు నమోదు చేశారు. ఎస్సై సిఫార్సు మేరకు రేషన్ దుకాణంలో తనిఖీలు నిర్వహించగా ఐదు క్వింటాళ్ల బియ్యం తక్కువగా ఉన్నట్లు గుర్తించి తొలగించినట్లు పేర్కొన్నారు. రేషన్‌దుకాణం-2 ఇన్‌ఛార్జి బాధ్యతలు నెల్లిబండతండా డీలర్‌కు అప్పగించినట్లు తెలిపారు.

పాఠశాల చెంత.. ప్రమాదకర గుంత

మండలకేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నీటి గుంత ప్రమాదకరంగా ఉంది. వృథానీటిని పొదుపు చేసేందుకు ఆరు పీట్ల లోతుతో ఇంకుడుగుంత పనులు చేపట్టారు. గుంత తీసి రెండు నెలలు గడుస్తున్నా ఎలాంటి పనులు చేపట్టకపోవడంతో ప్రస్తుతం అందులో నిండా వాన నీరు నిలిచింది. ఎలాంటి హెచ్చరికలు ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు ఆడుతూ గమనించకుండా గుంతలో పడిపోతారని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. తరచూ వర్షాలు పడుతుండడంతో పనులు సాగడం లేదు. వెంటనే నీటిని తోడించి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో మారుతి సత్యనారాయణరెడ్డి తెలిపారు. – మద్దిరాల, న్యూస్‌టుడే:



పంట నష్టపోయిన రైతులను ఆదుకోండి

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: మండలంలో అకాల వర్షాలు, ఈదురుగాలులుతో కోతదశకు వచ్చిన వరిపొలాలు నేలవాలి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, అరుణోదయ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచనపల్లి సైదులు అన్నారు. మండలంలోని ఏపూర్‌లో అవిరె చిన్నమల్లయ్యకు చెందిన కోతదశలోని 9ఎకరాల వరి పొలం ఈ నెల 19న వీచిన గాలులకు పూర్తిగా నేలవాలడంతో సోమవారం వారు పొలాన్ని సందర్శించి పరిశీలించారు. వ్యవసాయాధికారులు తక్షణమే పంట నష్టం సర్వే చేసి ఎకరాకు రూ.20వేలు పరిహారం అందించాలని కోరారు. ఏఐకేఎంఎస్ నాయకులు శ్రీశైలం, లింగయ్య, కాంతయ్య, ఈర్ల భిక్షం, తదితరులు పాల్గొన్నారు.



ఏపూర్‌లో నేలవాలిన అవిరె మల్లయ్య వరిపొలాన్ని పరిశీలిస్తున్న అఖిల భారత రైతుకూలీ సంఘ నాయకులు

అపార్ కార్డుతో విస్తృత ప్రయోజనాలు

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: ఆధార్‌కార్డు మాదిరిగానే పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ ఎకౌంట్ రిజిస్ట్రి) కార్డు కీలకంగా మారుతుందని ఎంఈవో పి.ధారాసింగ్ పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికి అపార్ కార్డును క్రియేట్ చేయడంపై మండల కేంద్రంలో సోమవారం వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికి 12 సంఖ్యల శాశ్వత నంబరు ఉంటుందన్నారు. కార్డులో విద్యార్థికి సంబంధించిన విద్యా విషయాలు, ధ్రువపత్రాలు భద్రపరిచి ఉంటాయన్నారు. ఉద్యోగ దరఖాస్తు చేసేసమయంలో ప్రతిసారి పత్రాలు సమర్పించకుండా ఈ నంబరు ఇవ్వడంతో అన్ని వివరాలు సులభంగా పొందవచ్చన్నారు. రిసోర్స్‌పర్సన్ వెంకటేశ్వర్లు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రవణ్‌కుమార్, వాసుదేవరెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.



ఆత్మకూర్(ఎస్)లో ప్రధానోపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో పి.ధారాసింగ్

కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి



చివ్వెంల: లక్ష్మీనాయక్‌తండాలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం సైదయ్య

ఆత్మకూర్(ఎస్): మండలంలోని గట్టికల్‌లో శ్రీలింగమంతులస్వామి మ్యాక్స్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఈవో లక్ష్మీప్రసన్న సోమవారం ప్రారంభించారు. సీనియర్ ఇన్‌స్పెక్టర్ బడేసాబ్, మ్యాక్స్ సీఈవో మడ్డి వెంకన్న, డైరెక్టర్లు అంజయ్య, లింగయ్య, రమేష్ పాల్గొన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో తుమ్మలపెన్‌పహాడ్, శెట్టిగూడెం, ఏపూర్, బోట్యాతండా, పాతసూర్యాపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. సీసీలు యాదగిరి, సుధాకర్, చందునాయక్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చివ్వెంల: లక్ష్మీనాయక్‌తండాలో కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం గుండాల సైదయ్య ప్రారంభించారు. కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సీసీలు ఉపేందర్, వెంకన్న, రైతులు పాల్గొన్నారు.

నూతనకల్: నూతనకల్‌లో మహిళా సమభావన సంఘాలు, జిల్లా సహకారసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ నాగం జయసుధ ప్రారంభించారు. ఏపీఎం రమణాకర్, సీసీలు ముత్తయ్య, సరస్వతి, గిరిధర్‌రెడ్డి, సంజీవరెడ్డి, అనిల్, మధుకర్‌రెడ్డి, చంద్రారెడ్డి, అంజయ్య, గణేష్, ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



నూతనకల్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ నాగం జయసుధ

మద్దిరాల గ్రామీణం: రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో ఖాతాలో డబ్బు జమయ్యేలా చూడాలని సూర్యాపేట డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని గుమ్మడవెల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.500 బోనస్ అందిస్తోందని తెలిపారు. ఏపీఎం మైసయ్య, వెంకన్న, శ్రీనివాస్, వినోద్, నర్సయ్య, శ్రీను, పాల్గొన్నారు.

మద్దిరాల: మండలంలోని పోలుమళ్ల, మండల సమాఖ్య ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం మైసయ్య సంఘబంధం అధ్యక్షులతో కలిసి ప్రారంభించారు. సంఘం బంధం మండలాధ్యక్షురాలు తోట లక్ష్మీ, గండు మమత, భాగ్యలక్ష్మీ, సీసీలు బాణాల నాగర్జునరెడ్డి, రమేష్, వీబీకేలు రాధిక, బాలయ్య, తార, అంజయ్య పాల్గొన్నారు.



గుమ్మడవెల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకం వేస్తున్న డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, తదితరులు

తుంగతుర్తి గ్రామీణం: వెలుగుపల్లిలో రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు ప్రారంభించారు. సీఈవో వెంకటేశ్వర్లు, ఆర్ఐ రవీంధర్‌రెడ్డి, డైరెక్టర్లు బిక్షం, మజీద్, రవీంధర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

తిరుమలగిరి: వెలిశాల, గుండెపురి గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ హరిప్రసాద్ ప్రారంభించారు. ఏవో నాగేశ్వర్‌రావు, ఎంపీఎం మధుసూదన్, సిసిలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఎస్పీకి వినతి

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: చిలుకూరు మండలం బేతవోలు గ్రామంలో దసరా పండగ సందర్భంగా కనకదుర్గమ్మ ఉత్సవాల్లో దళితులపై జరిగిన దౌర్జన్యంపై విచారణ నిర్వహించి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరుతూ మాల మహానాడు ఆధ్వర్యంలో ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హస్సేన్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేశ్, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



బి.శ్రీవల్లి

చివ్వెంల, న్యూస్‌టుడే: మండలంలోని కస్తూర్బా గాంధీ గురుకుల బాలికల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న బి.శ్రీవల్లి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎస్‌వో బి.నాగలక్ష్మీ సోమవారం తెలిపారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయిలో నిర్వహించిన ఖోఖో పోటీల్లో రాణించడంతో ఉమ్మడి జిల్లాకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. గతంలో అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి, తదితర పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చినట్లు వివరించారు. ఎస్‌వోతోపాటు పీఈటీ బి.సబిత, ఉపాధ్యాయురాళ్లు విద్యార్థినిని అభినందించారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: ఆత్మకూర్(ఎస్) ఎమ్మార్సీలో కాంట్రాక్టు ప్రాతిపదికన ఐఈఆర్పీ ఉపాధ్యాయుడిగా పనిచేసి ఇటీవల డీఎస్సీలో జాజిరెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాలలో స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగంలో ఎస్జీటీగా నియామకమైన బుడిగ రమేస్‌ను సోమవారం ఎమ్మార్సీ భవనంలో సన్మానించారు. వృత్తిపరంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని ఎంఈవో పి.ధారాసింగ్ కోరారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వెంకటరంగాచారి, చౌదర్‌రెడ్డి, మదనాచారి, జాన్, సిబ్బంది పాల్గొన్నారు.

నియామకం



తుంగతుర్తి, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడిగా డీసీసీ అధ్యక్షుడు **చెవిటి వెంకన్న యాదవ్**ను ఎంపిక చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ శాఖ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేశారు. దీంట్లో ఏడుగురు సభ్యులను ఎంపిక చేయగా వారిలో జిల్లా నుంచి వెంకన్నకు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని వినతి

నూతనకల్: వెంకేపల్లిలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు, వివిధ పార్టీల నాయకులు సోమవారం నూతనకల్ తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందించారు. జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ రైతులకు హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు తొన్కునూరి సైదులు, సీపీఎం గ్రామశాఖ చూడి మదుసూదన్‌రెడ్డి, రైతులు మల్లారెడ్డి, అర్జున్‌రెడ్డి, లవన్, నవీన్, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ ధరలు

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం వచ్చిన వివిధ పంట ఉత్పత్తులకు పలికిన గరిష్ఠ, కనిష్ఠ ధరల వివరాలు(రూపాయల్లో).

రకం	గరిష్ఠం	కనిష్ఠం
బీపీటీ	2833	2003
జైశ్రీరాం	3006	2006
ఐఆర్-64	1991	1706
హెచ్ఎంటీ	2742	2156
కందులు	9144	5389
పెసర	6429	4089
వేరుసెనగ	5029	3613
బొబ్బర్లు	5519	3613
మినుములు	5193	2393

విశ్వనాథుడికి అభిషేకాలు

సూర్యాపేట సాంస్కృతికంజిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ సహిత విశ్వనాథస్వామి ఆలయంలో స్వామివారికి పంచామృతాలతో అభిషేకం ఆలయ అర్చకుడు వలివేటి వీరభద్రశర్మ నిర్వహించారు. ఆలయంలో ఉదయం అర్చన అష్టోత్తర శతనామార్చనలు శాస్త్రోక్తంగా చేపట్టారు. సోమవారం కావడంతో తెల్లవారుజాము నుంచే భక్తుల రద్దీ నెలకొంది. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఉద్యమించాలి



సూర్యాపేటలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ వ్యవస్థాపక సభ్యుడు డాక్టర్ రంగారెడ్డి

కుడకుడరోడ్డు(సూర్యాపేట), న్యూస్‌టుడే: శాస్త్రీయ విద్యా సాధనతోపాటు ప్రజాస్వామ్య పరిరక్షణకై ఐక్యంగా ఉద్యమించాలని పీడీఎస్‌యూ వ్యవస్థాపక సభ్యుడు డాక్టర్ రంగారెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని లక్ష్మిగార్డెన్‌లో సోమవారం నిర్వహించిన పీడీఎస్‌యూ ప్రస్తుత, పూర్వ విద్యార్థుల జిల్లా సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలపై అలుపెరగని పోరాటలు చేస్తుందన్నారు. ఈ నెల 24న నిర్వహించే పీడీఎస్‌యూ పూర్వ, ప్రస్తుత విద్యార్థుల కలయిక సభకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. భద్రయ్య, ధర్మార్జున్, లక్ష్మాజి, కృష్ణరెడ్డి, ప్రతాప్, డేవిడ్ కుమార్, మల్లయ్య, పూలన్, వెంకట్‌యాదవ్, కిరణ్‌కుమార్, వెంకన్న, నాగయ్య, జనార్ధన్‌రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

అంజయ్య మృతి తీరని లోటు: ఆర్డీఆర్

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: మండలంలోని భక్తాళాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు యర్రంశెట్టి అంజయ్య(48) అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. ఆయన మృతదేహం వద్ద మాజీ మంత్రి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు సర్వోత్తమరెడ్డి నివాళి అర్పించి మాట్లాడారు. పార్టీ బలోపేతానికి అంజయ్య చేసిన కృషి మరువలేమన్నారు. ఆయన మృతి పార్టీకి, కుటుంబానికి తీరని లోటన్నారు. రాష్ట్ర నాయకులు తూముల భుజంగరావు, కొప్పుల వేణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సురేష్‌రావు, వీరయ్య, కోటేశ్వరరావు, ఉపేందర్, రామ్మూర్తి, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



భక్తలాపురంలో అంజయ్య మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి



పాతర్లపహాడ్‌లో.. కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న గ్రామస్థులు

పోలీసు అమరులకు కొవ్వొత్తుల నివాళి

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని పాతర్లపహాడ్‌లో సోమవారం రాత్రి మద్యపాన నిషేధ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ తీశారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో ఘనంగా నివాళి అర్పించారు. ఛైర్మన్ దొంతగాని కర్ణాకర్, కట్ట అజయ్, పరాల వెంకన్న, కాకి వెంకటరెడ్డి, సతీష్, సుమన్, వెంకటేష్, జానయ్య పాల్గొన్నారు.

28న కలెక్టరేట్ ఎదుట ధర్నా: సీపీఎం

తిరుమలగిరి: పెరిగిన అధిక ధరలకు వ్యతిరేకంగా ఈనెల 28న కలెక్టరేట్ ముందు సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తిరుమలగిరిలో నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యావసర ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు యాదగిరిరావు, మండల కన్వీనర్ ఉప్పలయ్య, లింగయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీ: యువకుడి మృతి

మద్దిరాల, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని గోరెంట్ల శివారు జాతీయ రహదారి 365పై సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం బురాన్‌పురానికి చెందిన ఆంబోతు ప్రశాంత్(30) అత్తగారి గ్రామమైన తొర్రూరు మండలం అమ్మాపురానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని తుంగతుర్తి ప్రాంతీయాసుపత్రికి తరలించారు. తమకు ఫిర్యాదు అందలేదని ఎస్సై ఎం.వీరన్న పేర్కొన్నారు.



ఆంబోతు ప్రశాంత్

రోజూ వర్షాలు.. మిర్చి రైతుల తంటాలు

నూతనకల్, న్యూస్‌టుడే: మిరప సాగుతో లాభాలు గడించాలని అప్పులుచేసి ముందుకుసాగిన రైతులకు వర్షాలు తీరని నష్టాన్ని కలిగిస్తున్నాయి. మూడు రోజులుగా వస్తున్న వానకి చెట్టుమొదళ్ల వద్ద ఏర్పాటుచేసిన మట్టి బొదెలు వరదనీటిని కొట్టుకుపోయి మొక్కలు నేలవాలాయి. చేసేదేమి లేక మండలంలోని యడవెల్లి గ్రామానికి చెందిన దుండిగళ్ల బిక్షం-గంగమ్మ దంపతులు సోమవారం మధ్యాహ్నం మండుటెండలో నేలవాలిన చెట్లకు ఊత కర్రలునాటుతూ నిటారుగా నిలిపారు.



వరదకు నేలవాలిన మిరపచెట్లకు కర్రలు నాటి తాడుకడుతున్న బిక్షం-గంగమ్మ దంపతులు

మత్తుకు దూరంగా ఉండాలని కళాజాత

మద్దిరాల గ్రామీణం, న్యూస్‌టుడే: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని తెలంగాణ సాంస్కృతిక సారథి ఈర్ల సైదులు కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం మండల పరిధిలో గుమ్మడవెల్లిలో మాదకద్రవ్యాల నిషేధం, గంజాయి నియంత్రణపై కళాజాత ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సారథి అధ్యక్షుడు వెన్నెల నాగరాజు పేర్కొన్నారు. బృందం సభ్యులు శంకర్, ఉదయ్, వేణు, శ్రీకాంత్, ఉపేందర్, మంజుల, స్రవంతి, శిరీష, రాధ, పాల్గొన్నారు.



గుమ్మడవెల్లిలో అవగాహన కల్పిస్తున్న బృంద సభ్యులు

ముందు జాగ్రత్తలతో ఆరోగ్య సంరక్షణ

పెన్‌పహాడ్: ముందు జాగ్రత్తలు పాటించి ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని మండల వైద్యాధికారిని స్రవంతి సూచించారు. ప్రపంచ అయోడిన్‌లోప రుగ్మతల నివారణ దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. శరీరంలో అయోడిన్ లోపం రాకుండా ప్రతి ఒక్కరు ఉప్పు వాడాలని సూచించారు.

✦ పీహెచ్‌సీలో మౌలిక వసతుల కల్పనకు తగిన కృషి చేస్తున్నామని ఎంపీడీవో వెంకటేశ్వరరావు, మండల వైద్యాధికారి స్రవంతి పేర్కొన్నారు. పీహెచ్‌సీలో నిర్వహించిన జనారోగ్య సమితి సమావేశంలో వారు మాట్లాడారు. వివిధ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రాల్లోని అసంపూర్తి పనులపై చర్చించారు. హెచ్ఈవో చంద్రశేఖరరాజు, పీహెచ్ఎన్ శశిరేఖ, సూపర్‌వైజర్ సైదులు, ఐసీడీఎస్ పాల్గొన్నారు.



పెన్‌పహాడ్ పీహెచ్‌సీలో మాట్లాడుతున్న మండల వైద్యాధికారిణి స్రవంతి